ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 22 ఫిబ్రవరి 2024 | 5

ఏపీ హక్కులు.. ఢిల్లీలో తాకట్టు సిగ్గుచేటు



ప్రత్యేక హోదా కోరుతూ చేపట్టిన రిలే దీక్షలకు మద్దతు తెలుపుతున్న చలసాని

- ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన మోదీ ప్రభుత్వం
- జగన్ కేంద్రంపై పోరాటం చేయకపోవడం అన్యాయం
- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్.. రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21: మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిందని, అయినా జగన్ కేంద్రంపై పోరాటం చేయకపోవడం అన్యాయమని, ఏపీ హక్కులను ఢిల్లీలో తాకట్టు పెట్టడం సిగ్గుచేటని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు చలసాని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మీడియాతోను, అక్కడకు వచ్చిన విద్యార్థులతోను మాట్లాడారు. పార్టీలకు అతీతంగా రాష్ట్ర యువత తమకు రావాల్సిన న్యాయమైన హక్కులకోసం పోరాటం చేయాలని, ప్రత్యేక హోదాతోనే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తొత్తులుగా మారి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటును ఇప్పటికైనా కాపాడాలని కోరారు. రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలుచేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రిలే నిరాహారదీక్షలు చేసిన కృష్ణచైతన్య, పొన్నల దినకరన్‌లకు చలసాని శ్రీనివాస్‌తోపాటు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, బి.రాజులోవ, ఎస్ రాజా, డాక్టర్ చైతన్య శేఖర్, వివిధ కార్మిక సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు నిరాహారదీక్షలకు మద్దతు తెలిపారు. రాజమహేంద్రి మహిళా కళాశాల విద్యార్థినిలు ఈ రిలే దీక్షా శిబిరానికి మద్దతుగా పాల్గొన్నారు.



మళ్లీ.. పోలీస్ యాక్ట్ 30

- ప్రతిపక్షాల లక్ష్యంగానే తాజా నిర్ణయమా
- రాజమహేంద్రవరం టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ సెక్షన్ అమలు
- మంత్రి వేణు కోసమేనా ఈ హడావుడి?

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 30ని తెరపైకి తెచ్చారు. సౌత్‌జోన్ పరిధిలోని టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆ సెక్షన్ అమలులోకి తెచ్చినట్టు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం నేరమని పేర్కొన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతలు నియంత్రించడంలోని ముందస్తు చర్యల్లో భాగంగా ఈ సెక్షన్ ప్రయోగించామని పోలీసులు చెబుతున్నారు. కానీ ఈ జోన్ పరిధిలోని ఈ సెక్షన్ పెట్టాల్సిన కారణాలపై పోలీసుల వద్ద సమాధానం లేదు. రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మంత్రి వేణు పోటీలో ఉన్నట్టు చెబుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆయన అక్కడ ఎక్కువగా పర్యటిస్తున్నారు. ఆ కార్యక్రమాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీఎస్పీని ఏరికోరి మంత్రి తీసుకొచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం గతంలోనే 'ఆంధ్రజ్యోతి' స్పష్టంచేసింది. ఇప్పుడు ఆయన జోన్ పరిధిలోనే సెక్షన్ 30 విధించడం గమనార్హం. మంగళవారం రాత్రి హోంమంత్రి తానేటి వనిత కాన్వాయ్‌ని కాంగ్రెస్ నాయకులు మెగా డీఎస్సీలో మోసంపై నిలదీస్తూ అడ్డుకున్నారు. ఆ క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని త్రీటౌన్ స్టేషనుకు తరలించారు. ఈ నిరసన త్రీటౌన్ స్టేషనుకు దగ్గరలోనే జరిగింది. ఈ ప్రాంతం సెంట్రల్ జోన్ పరిధిలోకి వస్తుంది. కానీ సౌత్‌జోన్ పరిధిలో అంటే మంత్రి వేణు పోటీలో ఉన్నానని చెప్పుకొంటున్న ప్రాంతంలో సెక్షన్ 30 అమలు చేయడంపై విమర్శలు వినవస్తున్నాయి. గతంలో చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో ఈ సెక్షనును సుదీర్ఘంగా అమల్లో ఉంచారు. అయితే అప్పట్లో ప్రతిపక్షాలపై కేసులు పెట్టి.. నగరం నడిబొడ్డున గుంపులుగా రోడ్లపై వేడుకలు చేసుకున్న వైసీపీ నాయకులను వదిలేయడం గమనార్హం.



రాజకీయం

- హీట్ పెంచిన పవన్ పర్యటన
- రాజానగరాన్ని వీడని ఉత్కంఠ
- రూరల్ సీటుపై కందుల ధీమా
- అయోమయంలో గోరంట్ల
- రాజానగరంపై స్పష్టతలేని వైనం
- రాజానగరంపై బత్తుల ఆశలు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం చుట్టూ రాజకీయం హీటెక్కుతోంది. జనసేనాని పవన్‌కల్యాణ్ పర్యటనతో ఇది మరింత సెగ పుట్టించింది. రాష్ట్రం అంతా ఒక ఎత్తు తూర్పుగోదావరి మరో ఎత్తు అనే చందంగా పరిస్థితి మారిపోయింది. టీడీపీకి ముందు నుంచీ 'తూర్పు'లో పట్టు ఎక్కువే. పైగా ఇప్పుడు టీడీపీ-జనసేన కూటమికి రాష్ట్రంలో అధికారం ఖాయమనే మూడ్‌లో జనం ఉండడంతో ఈ జిల్లాలోని సీట్లపై టీడీపీ, జనసేన, బీజేపీ ఆచితూచి ఆలోచన చేస్తున్నాయి. ఆశావహుల్లో మాత్రం ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన తమ అభ్యర్థుల ప్రకటనపై అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాయి. మంగళవారం జనసేనాని రాజమహేంద్రవరంలో పర్యటించిన సందర్భంలోనూ ఇదే స్పష్టమైంది. ఓ వైపు జనసైనికులకు ఉద్బోధ చేస్తూనే టీడీపీ నేతలతో పవన్‌కల్యాణ్ మంతనాలు జరుపుతూ పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళుతున్నారు. గతంలో టీడీపీతో పొత్తును పవన్ ఇక్కడి నుంచే ప్రకటించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఏదేమైనా రాజానగరం నియోజకవర్గం, రాజమహేంద్రవరం రూరల్ ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇక్కడ ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేయక పోవడం గమనార్హం. మరోవైపు వైసీపీలో గందరగోళం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించినా, నామినేషన్ వేసే వరకూ టిక్కెట్ వస్తుందనే నమ్మకం లేదని ఆ పార్టీలో సైతం చర్చ జరుగుతోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రాజానగరం సీటు ఇప్పుడు గరంగరంగా మారింది. రాజమహేంద్రవరం రూరల్ విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జనసేన జిల్లా అధ్యక్షుడు దుర్గేష్ రూరల్ సీటు తనకు కన్ఫర్మ్ అయిందని చెబుతున్నా పూర్తిస్థాయిలో స్పష్టత రావడంలేదు. ప్రస్తుత రూరల్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కాస్త వేచిచూసే ధోరణిలోనే ఇప్పటికీ ఉన్నారు. ఇక్కడ నుంచి ఎవరు పోటీ చేయాలనేది తమ పార్టీ అధినేత చంద్రబాబు, జనసేనాని అధినేత పవన్‌కల్యాణ్‌లు ఉమ్మడిగా ప్రకటిస్తారని తన అనుచరులతో చెబుతూ వస్తున్నట్టు సమాచారం. ఇటు జనసేనాని పవన్ మంగళవారం రాజమహేంద్రవరంలోని తమ పార్టీ కార్యాలయంలో అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ భేటీలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్‌పైనే ఎక్కువ చర్చ జరిగినట్టు తెలుస్తోంది. రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ గతంలోనే ప్రకటించడంతో అక్కడి నుంచి ఎవరు బరిలో ఉంటారనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. తనకే సీటు దక్కుతుందని బత్తుల బలరామకృష్ణ నమ్మకంతో ఉండగా మంగళవారం సమావేశంలో ఎటూ తేల్చకపోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో టీడీపీ నుంచి తానే పోటీలో ఉంటానని ఆ పార్టీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నుంచి బరిలో తానేనని కందుల దుర్గేశ్ ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ సీటుపై కూడా జనాల్లో చర్చ నడుస్తోంది. మంగళవారం సమావేశం అనంతరం రూరల్ తనకే ఖాయం చేశారని కందుల స్పష్టంచేయడం, అధిష్ఠానం నిర్ణయిస్తుందంటూ గోరంట్ల చెప్పడం చూస్తుంటే ఏక్షణంలో ఏ నిర్ణయం వస్తుందోనసే ఉత్కంఠ పెరిగిపోయింది. మరోవైపు రాజానగరం స్థానంలో జనసేన ఎవరిని పోటీకి దింపుతుందో చూసి సమఉజ్జీని బరిలో నిలపాలనే వైసీపీ వేచివుందని తెలుస్తోంది. ఇక్కడి నుంచి జనసేన అగ్రనేత ఎవరైనా పోటీకి దిగుతారా? అనే ఊహాగానాలు కూడా ఉన్నాయి. ఇదిలాఉండగా రాజమహేంద్రవరం పవన్ కల్యాణ్ వచ్చినప్పుడు టీడీపీ నాయకులతోనూ సమాలోచనలు జరిపారు. టీడీపీ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ నాయకులు హరీశ్‌మాధుర్‌తో సుమారు గంటపాటు చర్చించారు. దీనిపై కూడా ఉత్కంఠ నెలకొంది. ఇక రాజమహేంద్రవరం ఎంపీ సీటు వైసీపీ నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కి దక్కడంతో ఆయన క్షేత్రస్థాయి పర్యటనల్లో నిమగ్నమయ్యారు. పొత్తులో భాగంగా ఇక్కడ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లో ఏ పార్టీ నుంచి అభ్యర్థి ఉంటారోననే సందిగ్ధం నెలకొంది. టీడీపీ లేదా బీజేపీ నుంచే ఎంపీ స్థానంలో బరిలో ఉంటారనే వాదన ఉంది. బీజేపీ నుంచి పురందేశ్వరి రేసులో ఉన్నారని చెబుతున్నా ఆమె విశాఖ కోరుతున్నారని అంటున్నారు. ఒకవేళ విశాఖ నుంచి ఆమె పోటీకి దిగితే బాలకృష్ణ చిన్నల్లుడు భరత్‌ని రాజమహేంద్రవరం నుంచి బరిలో నిలపాలనే ఆలోచనలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఇక్కడ రాజకీయం వేడెక్కిందనే చెప్పాలి.



బీసీలకు జీవం పోసిన ఘనత టీడీపీదే

సమావేశంలో మాట్లాడుతున్న కుడుపూడి సత్తిబాబు

శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: శెట్టిబలిజ గౌడ, శ్రీశయన, యాత, ఈడిగలను గుర్తించి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా చేసిన ఘనత, స్థానిక సంస్థల్లో బీసీలకు జీవంపోసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆ పార్టీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల్లో గెలిచి సీఎం కావడం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్ అఖండ విజయం సాధించడం తథ్యమన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18న ఆనంద్ రీజెన్సీ వందిరిహాలులో తాము నిర్వహించిన శెట్టిబలిజ గౌడ ఆత్మీయ సమావేశం విజయవంతంకావడంతో వైసీపీ వారు ఓర్వలేక తమపై విమర్శలు చేశారన్నారు. వైసీపీలో ఇప్పుడు అవాకులుచవాకులు పేలుతున్న నాయకులకు గుర్తింపునిచ్చి రాష్ట్రస్థాయి పదవులను ఇచ్చింది టీడీపీయేనని అన్నారు. రాజమహేంద్రంవరంలో ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబాన్ని నేరుగా ఎదుర్కొనే దమ్ము, సత్తా లేక అడ్డగోలుగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, కానీ రాజమహేంద్రవరంలో ఉన్న శెట్టిబలిజ, గౌడలంతా కలిసి వాసును ఎమ్మెల్యేగా నెగ్గిస్తామన్నారు. టీడీపీ నగర బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ, నగర అధ్యక్షుడు బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆవిష్కరించారు. బుధవారం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్‌రాజు, జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి భరత్‌రాజు, మహిళా విభాగం కార్యదర్శి రాజకుమారిలు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డైరీని ఆవిష్కరింపజేశారు.

జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా మోతా శారద




జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శారదను అభినందిస్తున్న అమర్‌జా బేగ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని, అందులో భాగంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మోతా శారదను నియమించారని ఏఐసీసీ సభ్యురాలు అమర్‌జా బేగ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో కోర్లంపేట పార్టీ కార్యాలయంలో నూతన జిల్లా తొలి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారదకు నియామక పత్రాన్ని వారు అందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో అమర్‌జా బేగ్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అమాయిత్యాలు, అన్యాయాలను అరికట్టేందుకు శారద నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మార్టిన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. నూతన అధ్యక్షురాలు మోతా శారద మాట్లాడుతూ తన నియమకం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శాంతియాకుమారి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సమస్యలపై పోరాడతామన్నారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి జేవ్వ సతీష్‌బాబు, కిసాన్ సెల్ నాయకుడు కాకర్ల హరిబాబు, నలబాటి శ్యామ్, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రఫుల్లాబేగ్, డాక్టర్ వడయార్, జక్కంపూడి సత్తిబాబు, వీవీఆర్ చౌదరి, కాటం రవి, వెలగా రామకృష్ణ, ముప్పిడి శ్రీనివాస్, బండి భాస్కర్, కిషోర్‌కుమార్ జైన్, నల్లా వీర్రాజు, దోనపూడి సత్యప్రసాద్, ఉల్లిశెట్టి సత్తిబాబు, పిట్టా రామారావు, లక్కోండ డేవిడ్ రాజులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ జవహర్

కొవ్వూరు, ఫిబ్రవరి21: మీడియాపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగానే చూడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అన్నారు. గురువారం కొవ్వూరులోని రాజమహేంద్రవరం పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో జవహర్ పాత్రికేయులతో మాట్లాడారు. జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మీడియాపై దాడులు పెరిగాయన్నారు. ఆయనకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురిస్తున్నారనే దురుద్దేశంతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5 వంటి మీడియా సంస్థలు, పాత్రికేయులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులకు పరాకాష్టగా అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభ కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కక్షపూరితంగా దాడి చేశారన్నారు. రానున్న రోజుల్లో మీడియాను భయభ్రాంతులకు గురిచేస్తే వాస్తవాలు రాయకుండా ఉంటారని జగన్మోహనరెడ్డి కుట్ర అని మనమందరం అర్థం చేసుకోవాలన్నారు. మీడియాపై జరిగిన దాడులను బయటకు వచ్చి ఖండించకపోతే సమాజానికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వస్తుందన్నారు. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే వాహకాలు భయభ్రాంతులకు గురైతే ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. జీవనం కష్టంగా వెళ్తున్న పాత్రికేయులపైనా, పేదలు, బడుగు, బలహీనవర్గాలపైన దాడిచేయడం తగదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేటటువంటి పాత్రలో కచ్చితంగా పాత్రికేయులకు టీడీపీ అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం : శేషారావు

నిడదవోలు, ఫిబ్రవరి21: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేస్తోందని, పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగిస్తూ పాత్రికేయులపై దాడికి పాల్పడుతున్న వైసీపీ గుండాల దాడిని ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. బుధవారం నిడదవోలులో ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులపైనా, పాత్రికేయ సంస్థలపైనా వైసీపీ గుండాలు దాడులకు పాల్పడ్డం దుర్మార్గమైన చర్య అన్నారు. జగన్‌రెడ్డి పరిపాలనలో ఈ నాలుగున్నర సంవత్సరాలు అభివృద్ధి అధోగతి పాలైందని, సైకో పాలనను సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు.




ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి పంపిన లీగల్ నోటీసు ప్రతిని విలేకరులకు చూపుతున్న నల్లమిల్లి

ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి నల్లమిల్లి లీగల్ నోటీసు

- కోర్టు పరిధిలో ఉన్న అంశంపై అసత్య ప్రచారాలు చేస్తున్నందుకు న్యాయపోరాటం
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 21 : హైకోర్టు పరిధిలో ఉన్న అంశంపై అసత్య ఆరోపణలు చేస్తూ కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ పబ్బం గడుపుతున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం లీగల్ నోటీసులు పంపించారు. ఈ సందర్భంగా అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నోటీసు వివరాలను వెల్లడించారు. బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ సంస్థకు చెందిన 197 ఎకరాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అక్రమ మైనింగ్, చెట్ల నరికివేతపై తాను హైకోర్టులో రిట్ దాఖలు చేశానని, దీనిపై న్యాయస్థానం అక్కడ అక్రమ మైనింగ్, చెట్ల నరికివేతపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించి అక్రమ తవ్వకాలపై నిర్ధారణకు వచ్చిందని, దీంతో ఎమ్మెల్యే తాను నాగార్జున మెట్టను ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలనుకుంటే రామకృష్ణారెడ్డి కోర్టులో కేసు వేసి స్టే తెచ్చారని, అందుకే స్థలాలు ఇవ్వలేకపోతున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారని, దీనిపై సమాధానం చెప్పాలని కోర్టు ద్వారా నోటీసులు పంపానని నల్లమిల్లి తెలిపారు. నాగార్జున మెట్టపై అక్రమ మైనింగ్ జరిగిందని హైకోర్టు ధ్రువీకరించినప్పటికీ అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే కోర్టు ద్వారా లీగల్ నోటీసులు పంపడం జరిగిందన్నారు. టీడీపీకి పెరిగిన ఆదరణ చూసి ఓటమి తథ్యమని భావించి డమ్మీ పట్టాల పంపిణీకి అధికార పార్టీ నాయకులు తెరతీశారని, ఏడాదిన్నర కిందట రైతుల నుంచి సేకరించిన 58 ఎకరాల భూమికి నేటికీ ఒక్క రూపాయి చెల్లించలేదని పేదలను మోసగించేందుకు డమ్మీ పట్టాలు తయారు చేసి పంపిణీ చేస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత

జిల్లాలో కొత్తగా 16,875 ఓట్లు : కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 21: ఓటరు నమోదు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, ఓటు హక్కు కలిగి తమ ఓటు బదిలీకోసం తప్పనిసరిగా ఫారం 8 ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపు విధానంలో 0.1 శాతం కంటే ఎక్కువ జరిగిన సందర్భంలో సంబంధిత వివరాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. డిసెంబరు 10 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు పరిష్కారం చేసిన వివరాలు రాజకీయ పార్టీలకు అందజేసినట్టు తెలిపారు. కొత్తగా ఓటర్ల నమోదుకోసం ఫారం6లు 18,843 రాగా 16,875 ఆమోదించడం జరిగిందని, 1968 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓటరు తొలగింపు కోసం ఫారం 7లు 19,679 రాగా 10,567 ఆమోదించడం జరిగిందని 9,112 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఫారం 8లు 29,014 రాగా 26,894 ఆమోదించడం జరిగిందని, 2,120 పెండింగ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేఆర్ఆర్‌సీఎస్ డీటీ, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఏఆర్‌వో కృష్ణ నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నపర్వత మహా నివేదన



అన్నపర్వత మహా నివేదన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి బుధవారం రాత్రి 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన జరిపారు. పశ్చిమగోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. సాయంత్రం స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి మహా నివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, వేద పండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, పొలమూరు వంశీయులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, పొలమూరి సత్రం నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

ఘనంగా గ్రామోత్సవాలు



గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

అంతర్వేది, ఫిబ్రవరి 21: అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో భక్తులు బారులు తీరారు. తొలుత పొలమూరి వారి పార్థిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబసభ్యులు, భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగిన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట నారసింహ, గోవిందనామస్మరణలు చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావి వెంకటసత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం రాత్రి 8 గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి హారతులు పట్టారు.

వాడపల్లిలో విమాన వేంకటేశ్వరుని ప్రతిష్ఠ



ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం



ఆత్రేయపురం, ఫిబ్రవరి 21: కోనసీమ తిరుమల వాడపల్లిలో తిరుమల తరహాలో విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. రెండో రోజైన బుధవారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమాలను జరిపారు. మేళతాళ మంగళవాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఉదయం 10.31 గంటలకు విమాన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ఊబలంకకు చెందిన మేడపాటి శ్రీనివాసరెడ్డి(ఎంఎస్ఆర్) కుమారుడు సిద్ధార్థ రెడ్డి-అన్వితరెడ్డి దంపతులు ప్రతిష్ఠించారు. అనంతరం మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్, అయినవిల్లి దేవస్థానం ఈవో ముదునూరి సత్యనారాయణరాజు, వాడపల్లి ధర్మకర్తల మండలి సభ్యులు మన్యం సూర్యకుమారిభాను, వి.సురేష్‌రాజు, ప్రముఖులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలోకి మల్లాడి రాజేంద్రప్రసాద్

సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన పవన్‌కల్యాణ్



రాజేంద్రప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 21: కాకినాడ నగరానికి చెందిన మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మత్స్యకార నాయకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్ బుధవారం జనసేన పార్టీలో చేరారు. భీమవరంలో పార్టీ నాయకుల సమావేశం జరుగుతున్న ప్రాంగణానికి కాకినాడ జగన్నాథపురంలోని తన నివాసం నుంచి 100 కార్లలో ర్యాలీగా వెళ్లారు. అక్కడ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరారు. రాజేంద్రప్రసాద్‌కు పవన్‌కల్యాణ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. జనసేనను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ రానున్న ఎన్నికల్లో బలంగా పనిచేయాలని పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ కాకినాడ నుంచి భీమవరానికి తనతోపాటు ర్యాలీగా వచ్చిన జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. కాకినాడ నగరంలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించి పార్టీని, జనసేనాని ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు. కాకినాడ నగరంలో భూకబ్జాలు, అరాచకాలు బాగా పెరిగిపోయాయన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్రమాల నుంచి కాకినాడను కాపాడుకోవాలన్నారు. వైసీపీ అరాచక పాలన అంతం జనసేన ద్వారానే సాధ్యమన్నారు. మత్స్యకారులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన ద్వారంపూడిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళ మెడలో చైన్ లాక్కుని పరారీ



సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యం

అనపర్తి, ఫిబ్రవరి 21 : అనపర్తిలో బుధవారం తెల్లవారుజామున ఓ మహిళ మెడ నుంచి 28 గ్రాముల బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కొని పరారయ్యాడు. ఈ పెనుగులాటలో మహిళకు గాయాలయ్యాయి. ఆమెను ఆస్పత్రికి తరలించారు. అనపర్తిలోని మార్కండేయపురంలో వరలక్ష్మి అపార్ట్‌మెంట్ ఎదురుగా నివాసం ఉంటున్న తేతల పుష్పావతి తెల్లవారుజామున లేచి వాకిలి శుభ్రం చేస్తుండగా దారిన వెళుతున్న వ్యక్తి ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కుని పరారయ్యాడు. వ్యక్తిని పట్టుకునే ప్రయత్నం చేసిన పుష్పావతి అదుపుతప్పి మెట్లపై నుంచి కిందకు పడిపోవడంతో గాయాలపాలైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని గొలుసు విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని సీసీ పుటేజ్ ద్వారా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ రామారావు తెలిపారు.

సందిగ్ధంలో జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం

- రూ.10,116 టిక్కెట్టు ధరతో నిర్వహించాలని కమిషనర్ ఉత్తర్వులు
- ఏడుగంటలు చేయాల్సిన జ్యోతిర్మయి వ్రతాన్ని మూడున్నర గంటల్లో ఎలా చేపడతారని భక్తుల ప్రశ్న
- నిలకడలేని వైదిక కమిటీ నిర్ణయం



అన్నవరం, ఫిబ్రవరి 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో నూతనంగా ప్రవేశపెట్టనున్న జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం నిర్వహణ ప్రస్తుతం సందిగ్ధంలో పడింది. ఇప్పటికే దేవస్థానంలో రూ 300, 1000, 1500, 2000 ధరలతో వ్రతాలు జరుగుతుండగా ఇవన్నీ దేవస్థానం వ్రతపురోహితులు వ్రతభక్తులతో మంత్రపూర్వకంగా తమలపాకులపై అక్షింతలు, వక్కలతో అష్టదిగ్పాలకులు, పంచభూతాలు, నవగ్రహాలతో ఆవాహన చేయిస్తారు. అయితే ఈవో ఆజాద్ పనిచేసిన కాలంలో అప్పటి వైదికకమిటీ నిర్ణయంతో జ్యోతిర్మయి సత్యదేవ వ్రతం చేపట్టవచ్చునని సూచించారు. ఈవ్రతంలో ప్రత్యేకత ఏమిటంటే జ్యోతులలో ఆవాహన చేయించాలి. దీనిపై ఆజాద్ దేవదాయ కమిషనర్ అనుమతి కోసం దస్త్రాన్ని పంపగా రూ.10,116ల వ్రతం టిక్కెట్ ధర నిర్ణయించి వ్రత సామగ్రికి రూ.4500, మిగిలిన మొత్తంలో 40 శాతం కమిషన్‌ను వ్రతపురోహితులకు చెల్లించాలని కమిషనర్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి పాత అకౌంట్ విభాగ కార్యాలయాన్ని జ్యోతిర్మయి వ్రత మండపంగా నిర్ణయించి తుది మెరుగులు దిద్దారు. ప్రత్యేక ఏసీ మండపం, ఇంద్రలోకం తలపించేలా దేవతామూర్తుల పెయింటింగ్ తదితర పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈలోగా ఆజాద్ అన్నవరం దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. ఆయన స్థానంలో వచ్చిన రామచంద్రమోహన్‌ను కొందరు పండితులు, శాస్త్రం తెలిసిన భక్తులు కలిసి ఈ వ్రతం శాస్త్రోక్తంగా జరగాలంటే సుమారు 7 గంటల సమయం పడుతుందని ఇంటివద్ద ఆచరించుకొనే వారికి మాత్రమే సాధ్యమవుతుందని ఏడుగంటల పాటు చేపట్టాల్సిన వ్రతాన్ని మూడున్నర గంటలకు కుదించడం ఏమిటని అన్నారు. దీని వలన భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొనడంతో ఈవో రామచంద్రమోహన్ ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకుని వైదిక కమిటీని ప్రశ్నించగా తాము సమయం అధికమవుతుందని చెప్పగా కుదించి చేయడానికి అవకాశం ఉంటుందా అని అడగడంతో విధిలేని పరిస్థితుల్లో మూడున్నర గంటల సమయంలో పూర్తిచేయవచ్చునని తెలిపినట్లు చెప్పినట్లు తెలిసింది. అయితే ఈవో రామచంద్రమోహన్ భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్రత నిర్వహణను తాత్కాలికంగా వాయిదా వేసి దీనిపై చైర్మన్, పాలక మండలిసభ్యులతో చర్చించి దేవదాయ కమిషనర్‌కు నివేదిక పంపి తదుపరి చర్యలు తీసుకోవాలని ఆలోచన చేస్తున్నారు. ఏదిఏమైనా అన్నవరం దేవస్థానంలో వైదికపరమైన నిర్ణయాలు తీసుకునే సమయంలో వైదిక కమిటీ అధికారుల మెప్పుకోసం కాకుండా ఆలయ ఆచార సంప్రదాయాలు, భక్తుల మనోభావాలు దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని పలువురు భక్తులు కోరుతున్నారు.

రిటైర్డ్ అధికారులు ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో

ఆంక్షలు విధించాలి

- అందుకోసం సుప్రీంకోర్టులో పిల్ వేస్తా
- ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతాం
- పాత్రికేయులపై దాడి ఘటనలను హైకోర్టు సుమోటోగా తీసుకోవాలి
- అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, రిటైర్డ్ న్యాయమూర్తులు ఎన్నికల్లో పోటీచేసే విషయంలో ఆంక్షలు విధించాలని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు. తూరుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ కళాశాల కాన్ఫరెన్స్ హాలులో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల్లో పనిచేసిన ఉన్నతస్థాయి అధికారులు ఆయా ప్రభుత్వాలకు బాగా అనుకూలంగా పనిచేసి అటుపై ఉద్యోగ విరమణ తర్వాత ఎన్నికల్లో పోటీ చేసేందుకు ముందుకు వచ్చేస్తున్నారని అటువంటి వారికే రాజకీయ పార్టీలు కూడా సీట్లు ప్రాధాన్యం ఇచ్చి అప్పటివరకు ఎన్నోఏళ్లుగా పార్టీ విధేయులుగా పనిచేసిన నాయకులను పక్కనపెట్టి సీట్లు కేటాయించడం వల్ల చాలామందికి అన్యాయం జరుగుతోందన్నారు. ఈ విషయంలో తాను అభ్యంతరం వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేస్తానన్నారు. రిటైర్డ్ అయిన అధికారి ఐదేళ్ల వరకు ఎన్నికల్లో పోటీచేసే అర్హత లేకుండా చట్టం తీసుకోవాలని కోరతామన్నారు. అదే విధంగా న్యాయ వ్యవస్థలో న్యాయమూర్తులుగా ఉన్నవారు కొంతమంది చాలా కేసుల్లో ప్రభుత్వాలకు అనుకూలంగా తీర్పులు ఇస్తున్నారని అవి ప్రజావ్యతిరేకమైనవన్నారు. ఇలా ప్రభుత్వాలకు సహకరిస్తే వారు పదవీ విరమణ పొందాక రాష్ట్ర గవర్నర్‌లుగా నియమించే పరిస్థితులు ప్రస్తుతం ఉన్నాయన్నారు. ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో పనిచేసి పదవీ విరమణ చేసిన అధికారులు వెంటనే ఎన్నికల్లో పోటీ చేయకుండా చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళతామన్నారు. వ్యవస్థలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా రంగంపై ఈ ప్రభుత్వం దాడులకు దిగడం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ పార్టీలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రాంగోపాల్ రెడ్డి లాంటి నాయకులు కూడా వైసీపీలోకి వెళ్లాక దారుణంగా మారడం దురదృష్టకరమన్నారు. పాత్రికేయులు, ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని హైకోర్టు ఈ సంఘటనలను సుమోటోగా స్వీకరించాలని కోరారు. ఇక కాంగ్రెస్ పార్టీలో జరిగే పరిణామాలపై ఆయన స్పందించారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిలారెడ్డి నియమితులవడం, జగన్ మనిషి అళ్ల రామకృష్ణారెడ్డి లాంటి వాళ్లు వెళ్లినట్టు వెళ్లి తిరిగి వెనక్కి రావడం వెనుక జగన్ ప్లాన్ ఉందన్నారు. అంతా జగన్‌ప్లాన్ ప్రకారం జరుగుతుందని బహుసా షర్మిలారెడ్డిని కాంగ్రెస్‌లోకి జగనే పంపించి ఉంటాడనే అనుమానం వ్యక్తం చేశారు. షర్మిలారెడ్డి మాత్రం అన్న జగన్‌ను టార్గెట్ చేశారని దీనివెనుక ప్రయోజనం ఎవరికి అనేది త్వరలో తేలుతుందన్నారు. తాను ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించాక పోటీ గురించి చెబుతానని అమలాపురం నుంచే పోటీ ఉంటుందన్నారు. ఇటీవల తాను నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో అమలాపురం ప్రాంత ప్రజలు 79 శాతం మంది తనకు అనుకూలంగా ఉన్నట్లు ఫలితం వచ్చిందన్నారు. ఇక రాజకీయ పార్టీల పొత్తు విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత కనరావడం లేదన్నారు.

250 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

గండేపల్లి, ఫిబ్రవరి 21: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో మురారి గ్రామ శివారులో పోలవరం గట్టు వద్ద నుంచి గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు ఆధ్వర్యంలో గండేపల్లి ఎస్ఐ ఎస్ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఒడిసాకు చెందిన దామాకార అతని ముగ్గురు స్నేహితులు విశాఖ ఏజెన్సీలోని ధారకొండ నుంచి మహారాష్ట్రకు సుమారు 250 కిలోల గంజాయిని 12 ప్లాస్టిక్ బస్తాల్లో తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దామాకారను, రెండు మోటార్ బైకలను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారన్నారు. త్వరలో వారిని కూడా పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు. దామాకారను అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్ నిమిత్తం పెద్దాపురం తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

25 కిలోల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఫిబ్రవరి 21: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్‌స్టేషన్ ఎదుట మోతుగూడెం ఎస్ఐ జి. గోపాలరావు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు కారులో 25 కిలోల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయిని ఒడిసాలోని చిత్రకొండ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారన్నారు. ప్రకాష్ రఘునాథచౌదరి, రాజు అలిమాను, మనోజ్ చౌదరి, కల్పేస్ భావిస్కర్‌లపై కేసులు నమోదు చేసి, వారి వద్ద నుంచి కారు, సెల్‌ఫోన్‌లు, 25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ రాజేశ్వరరావు, సూర్యనారాయణరాజు, హెడ్ కానిస్టేబుల్ రాజు, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్చి 14న పొగాకు కొనుగోళ్లు



సమావేశానికి హాజరైన గోపాలపురం రైతులు

గోపాలపురం, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు పంట పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ గుంటూరులో జరిగిన పొగాకు బోర్డు కార్యాలయంలో సూచించినట్లు రైతులు తెలిపారు. 3వ విడత మార్చి 14న గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పొగాకు బోర్డులో పొగాకు కొనుగోళ్లు ప్రారంభానికి సంబంధించి అనుమతి లభించిందన్నారు. మొదటి విడత ఫిబ్రవరి 29న, ఒంగోలు కొండెపి, రెండో విడత మార్చి 6న కందుకూరు, 1, 2 వేలం కేంద్రాల్లో వెల్లంపల్లిలో కొనుగోళ్లు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి రీజనల్ మేనేజర్ ఆదిశేషయ్య, వేలం నిర్వహణాధికారి ఏడీ శ్యామ్, పొగాకు బోర్డు రైతు సంఘం నాయకులు పిన్నమనేని మధుమోహన్, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరిరావు, ఇల్లూరి రామ్‌తో పాటు 5 పొగాకుబోర్డు రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు అన్నవరం దేవస్థానంలో సరస్వతి పూజ

అన్నవరం, ఫిబ్రవరి 21: త్వరలో జరిగే పదో తరగతి, ఇంటర్ తదితర పబ్లిక్ పరీక్షలలో విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశంతో అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సరస్వతి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 8.30కి విద్యార్థులందరూ రత్నగిరికి చేరుకోవాలని 9 గంటలకు సరస్వతి పూజ నిత్య కల్యాణ మండపంలో ప్రారంభమవుతుందని చెప్పారు. అలాగే నూతన రథంతో 10 గంటలకు ప్రాకార సేవ జరుగుతుందని అధికారులు వెల్లడించారు.

హైవోల్టేజీ వైరు పట్టుకుని వ్యక్తి ఆత్మహత్య



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైవోల్టేజీ కరెంటు వైరు పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపారు. రాజమండ్రి రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు ఎక్కి కరెంటు వైరు పట్టుకున్నాడని, దీంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడన్నారు. కుడి చేయిపై బిందు, అమ్మ, ఓం అని పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఫోన్ నం.08832442821, 9491444022కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

రైలు నుంచి జారిపడి బిహార్ వాసి మృతి



తుని రూరల్, ఫిబ్రవరి 21: తుని రైల్వేస్టేషన్ పరిధిలో రావికంపాడు, అన్నవరం మధ్యలో పాట్నా వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి వ్యక్తి జారి పడి బిహార్‌కు చెందిన గణేష్ మండల్ మృతి చెందాడు. ప్రయాణికులు అప్రమత్తమై ట్రైన్ చైన్ లాగి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం దక్కలేదు. ఎస్ఐ షేక్ మారుఫ్ కేసు నమోదు చేశారు. గణేష్ మండల్ (50) బిహార్‌కు చెందిన వ్యక్తిగా తెలిపారు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

28న మెగా జాబ్‌మేళా

ఐదు జిల్లాల పరిధిలో యువతకు అవకాశాలు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: జోన్-2 పరిధిలో ఐదు జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ ఎస్‌వీఎస్ మూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు వీఎల్‌పురం మార్గాని ఎస్టేట్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో బుధవారం తూర్పుగోదావరి, కోనసీమ, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో నోడల్ అధికారులతో జాబ్ మేళాపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ సుమారు 100 కంపెనీల భాగస్వామ్యంతో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం మెగా జాబ్ మేళా నిర్వహించడం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ జాబ్ మేళాలో 6 వేలకు పైబడి ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. మండలానికి కనీసం వంద మంది నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యేలా వాట్సాప్, ఎస్ఎంఎస్‌లు, ఇంటింటా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సహాయ సీఈవో ఎస్.రామ్‌గోపాల్, జిల్లా ఉపాధి కల్పనా అధికారి కె.హరిశ్చంద్రప్రసాద్, జిల్లా పరిశ్రమల అధికారి బి.వెంకటేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, డివిజనల్ డీఆర్‌వో ఎంఎల్ ఆచార్యులు, ఐదు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎంఏ పరీక్ష ఫలితాల్లో జాతీయస్థాయిలో 11వ ర్యాంక్



శ్రీహర్షిణి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా డిసెంబరు 2023లో నిర్వహించిన జాతీయ స్థాయి సీఎంఏ ఫైనల్ పరీక్షల్లో రాజమహేంద్రవరానికి చెందిన విద్యార్థిని కొత్తగుండు శ్రీహర్షిణి 11వ ర్యాంక్ సాధించింది. అదే విధంగా జాతీయ స్థాయిలో ఇంటర్ పరీక్షల్లో కూడా 37వ ర్యాంక్ సాధించింది. ఉభయగోదావరి జిల్లాలలో చాలా మంది విద్యార్థులు సీఎంఏ ఇంటర్, సీఎంఏ ఫైనల్స్ ఉత్తీర్ణత సాధించారు. ఈ ర్యాంక్ తో పాటు జాతీయ స్థాయిలో సీఎంఏ ఫైనల్స్‌లో ఎం.జగదీష్ 47వ ర్యాంక్, పి. సురేష్ 50వ ర్యాంక్, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో సాయి మేఘన 48వ ర్యాంక్ సాధించారని చాప్టర్ మేనేజ్‌మెంట్ టీం పి.నారాయణరావు, శ్రీధర్, బొజ్జ నారాయణ తెలిపారు. శ్రీహర్షిణి తండ్రి కొత్తగుండు శ్రీధర్ వేమగిరిలో శ్రీసర్వరాయ షుగర్స్ కోకోకోల కంపెనీలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు.

లొంగిపోయిన మావోయిస్టు

చింతూరు, ఫిబ్రవరి 21: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసుల ఎదుట మావోయిస్టు పార్టీ దళ సభ్యుడితో పాటు మిలిషియా సభ్యుడు లొంగిపోయారు. చింతూరు ఏఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి బుధవారం విలేకర్లకు వివరాలు అందించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, సుక్మా జిల్లా, గచ్చనపల్లికి చెందిన వద్దం అడమయ్య 2014లో మావోయిస్టు విధానాలకు ఆకర్షితుడయ్యాడు. ప్రస్తుతం అడమయ్య గొల్లపల్లి ఎల్ఓఎస్ (లోకల్ ఆర్గనైజేషన్ స్క్వాడ్) సభ్యుడిగా కిష్టారం పరిధిలో పార్టీ కార్యక్రమాలు చేపడుతున్నాడు. ఇదే ప్రాంతానికి చెందిన కణతి లచ్చ 2019 నుంచి 2021 వరకు మిలిషియా సభ్యుడిగా వ్యవహరించాడు. వివిధ కారణాలతో వీరిద్దరూ లొంగిపోవడంతో వారిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ చేపడుతున్న పరివర్తన, ఆత్మీయ సమ్మేళనం, స్ఫూర్తి తదితర కార్యక్రమాలతో పలువురు జనజీవన స్రవంతిలోకి వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని ఏఎస్పీ చెప్పారు. లొంగి పోయిన ప్రతి మావోయిస్టుకు ప్రభుత్వం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ 42 బెటాలియన్ ఇన్‌ఛార్జి మోతీలాల్, సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

అడమయ్య నేరాల జాబితా

2016లో ఛత్తీస్‌గఢ్‌లోని పొట్టకపల్లిలో మావోయిస్టులు చేపట్టిన దాడిలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ కమాండోల మృత్య 2017 లో కొత్తపల్లిలో చేపట్టిన అంబుష్ ద్వారా 12 మంది సీఆర్‌పీఎఫ్ కమాండోలు, అదే ఏడాది జెగురుగొండ పోలీసు స్టేషను పరిధిలోని రాయిగూడ వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో 7 గురు సీఆర్‌పీఎఫ్ కమాండోలు, 2018లో కిష్టారం సమీపంలో 12 కమాండోల దారుణహత్యల ఘటనలలో అడమయ్య పాల్గొన్నాడు.

95 డిటోనేటర్స్ స్వాధీనం

మావోయిస్టులకు పేలుడు సామగ్రి అందిస్తున్న ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న పేలుడు సామగ్రి

చింతూరు, ఫిబ్రవరి 21: మావోయిస్టులకు పేలుడు సామగ్రి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అందించిన వివరాలు ప్రకారం.. ఒడిసా రాష్ట్రం, మల్కాన్‌గిరి జిల్లా అనంతపల్లికి చెందిన నక్కా దావీదు, అలియాస్ డేవిడ్ రాజు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా పట్నంపారాకు చెందిన బీమాల్ విశ్వాస్ తెలంగాణ రాష్ట్రం నుంచి వయా చింతూరు మండలం మీదుగా పేలుడు సామగ్రిని తరలించే యత్నం చేశారు. 30వ నెంబరు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వారు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. ఆ సమయంలో వారి వద్ద పేలుడు సామగ్రి లభ్యమైందని ఏఎస్పీ చెప్పారు. పేలుడు సామగ్రిని మావోయిస్టులకు చేరవేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడైందన్నారు. దీంతో వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి 95 డిటోనేటర్స్, 15 మీటర్ల ఫ్యూజ్ వైర్, 190 జిలిటిన్ స్టిక్స్ మావోయిస్టులు రాసి ఇచ్చిన పేలుడు సామగ్రి లిస్టు, రూ. 13 వేల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ గజేంద్ర కుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం

జర్నలిస్టులపై దాడులు దారుణం

నిందితులను కఠినంగా శిక్షించాలి



ఆందోళన నిర్వహిస్తున్న జర్నలిస్టులు

చింతూరు, ఫిబ్రవరి 21 : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని, ఈనాడు కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని కూడా కఠినంగా శిక్షించాలని చింతూరు డివిజన్ పాత్రికేయ సంఘం నాయకుడు ఎం.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చింతూరు డివిజన్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఐటీడీఏ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇటువంటి దాడులు పునరావృతం కాకూడదని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఏఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, ఐటీడీఏ ఏపీవో సుజాత, ఏవో రాజకుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు మస్తాన్‌జానీ, ఎస్ఏ ఆసిఫ్, వినయ్, శ్రీనివాసాచారి, ప్రేమ్‌నాథ్ ఈశ్వరాచారి, బెజవాడ నరేష్, రామకృష్ణ, సుధ పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాజవొమ్మంగి ఫిబ్రవరి 21: వైసీపీ రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడిచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అల్లూరి రాజవొమ్మంగి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గొల్లపల్లి బాలరాజు అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం వారు నిరసన చేపట్టారు. తహశీల్దార్ సత్యనారాయణకు, పోలీసుస్టేషన్‌లో అడిషనల్ ఎస్ఐ జాన్ కుమార్‌కు వినతిపత్రాలు అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు బాలరాజు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై దాడి చేయడం అమానుషమని నిందితులకు కఠినశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్ కార్యదర్శి పి.రామరాజు మాట్లాడుతూ కర్నూలులో ఈనాడు కార్యాలయంపై కొందరు రాళ్లదాడి చేయడం దారుణమని అన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు తూపాటి వీర్రాజు, పెద్దిరెడ్డి వేంకటేశ్వరావు, కుర్మాసుల శివప్రసాద్, సత్తిబాబు, సూరిబాబు, ఎండీ రాజు, లక్ష్మణ్, శ్రీను, బ్రహ్మాజీ తదితరులు ఉన్నారు.

దాడిని ఖండించిన నేతలు

దేవీపట్నం, ఫిబ్రవరి 21: రాప్తాడులో ఆంధ్రజ్యోతి విలేకరిపై జరిగిన దాడి అమానుషమని దేవీపట్నం మండల టీడీపీ నాయకులు ఖండించారు. వైసీపీ మూకలు విలేకరిపై దాడులు చేయడం అత్యంత దుర్మార్గపు చర్య అని అన్నారు. అలాగే ఈనాడు కార్యాలయం ధ్వంసం చేయడం దారుణమన్నారు. మరికొన్ని రోజుల్లో ప్రభుత్వం మారుతుందని ఇలాంటి దుశ్చర్యలు మానుకోకపోతే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నగేష్, బాబూరావు, చంటి, మండల నాయకులు లంకా హరిశ్చంద్రుడు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలి

దేవీపట్నం, ఫిబ్రవరి 21: ఆశ్రమ పాఠశాలలో తక్షణమే ఏఎన్ఎం, ప్రత్యేకంగా వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని భారత్ ఆదివాసీ పార్టీ, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. భారత్ ఆదివాసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్, అఖిలపక్ష నాయకులు కారం రామన్నదొర, మడకం బంగారుబాబు, యలగాడ నాగేశ్వరరావు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యా సంవత్సరం ప్రారంభమై తొమ్మిది నెలలు పూర్తికావొస్తున్నా నేటికీ ఏఎన్ఎం, ప్రతీ హాస్టల్‌కు ప్రత్యేకంగా వార్డెన్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. హాస్టల్స్ ప్రహరీ చుట్టూ సోలార్ ఎనర్జీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదని, ఆటస్థలాలు సక్రమంగా లేవన్నారు. అనంతరం దేవీపట్నం మండలం ముసినికుంట, దామనపల్లి ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాల, కళాశాలను సందర్శించి హెచ్ఎం, విద్యార్థులతో మాట్లాడారు.

27న ఉపాధ్యాయుల పదోన్నతి కౌన్సెలింగ్

రంపచోడవరం, ఫిబ్రవరి 21: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గల ఆశ్రమ, జీపీఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీలు, తత్సమాన అర్హత గల ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్స్ (అప్ గ్రేడ్ కాబడిన తెలుగు, హిందీ పండిట్స్, పీడీ పోస్టులు) పదోన్నతులు కల్పించేందుకు ఈ నెల 24వ తేదీ శనివారం ఐటీడీఏ మీటింగ్ హాల్లో సర్వీస్ రిజిస్టర్, ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు కె.అబుసలాం తెలిపారు. పదోన్నతి కౌన్సెలింగ్ 27న నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ప్రారంభం

రంపచోడవరం, ఫిబ్రవరి 21: బోర్నగూడెంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ పి.ప్రవీణ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ తీగల మురళీ మోహన్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని ప్రారంభించారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ప్రజలు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని వారు కోరారు. సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కౌన్సిలర్లు డి.శ్రావణి, రమేష్, విశ్వనాథ్, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్‌డే నిర్వహించాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 21: ఎస్సీ ఎస్టీ వర్గాలకు అండగా ఉండే సివిల్ రైట్స్‌డేను నిర్వహించాలని దళిత రైట్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాదే రామచంద్రరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో కల్పించిన సివిల్ రైట్స్‌డేను జిల్లాలో గాని, మండలాల్లో గాని నిర్వహించడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలు, అభివృద్ధి తదితర అంశాలపై పరిష్కారం కొనసాగే దిశగా సివిల్ రైట్స్‌డేను అధికారులు నిర్వహించి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు.

పొలాలకు నీరందించలేని స్థితిలో ప్రభుత్వం

రాజవొమ్మంగి ఫిబ్రవరి 21: పంట పొలాలకు నీరందించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని టీడీపీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత అన్నారు. బుధవారం జడ్డంగి గ్రామంలోని మడేరు ఆయకట్టు భూమి రైతులతో గొర్లె సునీత మాట్లాడారు. ప్రతి ఏడాది సొంత డబ్బులతో పంట పొలాలకు నీరు వచ్చేలా ఏర్పాట్లు చేసుకుంటున్నామని, చిన్న నీటిపారుదల శాఖ అధికారులు మండలంలో లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఉందని రైతులు వాపోయారు. గొర్లె సునీత మాట్లడుతూ వైసీపీ ప్రభుత్వం రైతులు, మహిళల పక్షపాతి ప్రభుత్వమని గొప్పలు చెపుతారు తప్ప రైతుల కోసం ఏం చేసారని ప్రశ్నించారు. గణజాల తాతారావు, బారంగి అనుదీప్, వానంశెట్టి గంగాధర్, ఎలిశెట్టి అప్పలరాజు, కాళ్లకూరి సుందరరావు ు ఉన్నారు.

'ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి సరికాదు'

చింతూరు, ఫిబ్రవరి 21 : ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే కారకుడని టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి ఆరోపించారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సీఎం ప్రతి సభలో మీడియాపై అక్కసు వెళ్లగక్కడం పరిపాటిగా మారిందన్నారు. దీంతో వారి పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారన్నారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.వెంకటేశ్వరరావు, పొడిలి రామారావు, రంజిత్‌కుమార్ చౌదరి సురేష్‌చౌదరి, శీలం తమ్మయ్య, కుంజ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విలీన మండలాల సమస్యలు పరిష్కరించాలి

చింతూరు, ఫిబ్రవరి 21 : విలీన మండలాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అరకు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి గొడేసుల రంజిత్ కుమార్ చెప్పారు. ఈ మేరకు ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అంగన్వాడీ, పాఠశాలల భవనాలు మరమ్మతులకు గురయ్యాయని తక్షణమే వాటికి మరమ్మతులు చేపట్టాలని రంజిత్‌కుమార్ పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ముంపు బాధితులకు పునరావాస చర్యలు చేపట్టాలని, కోరారు. కోతులగుట్ట ఏడుగురాళ్లపల్లి రహదారి పనులు వేగవంతం చేయాలని ఆయన కోరారు.

పరీక్షల్లో ఒత్తిడిని జయించడంపై కౌన్సెలర్లకు శిక్షణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని జయించడం, ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకోవడం, సోషల్ మీడియా వాడకం తగ్గించుకోవడంపై కళాశాలల్లోని కౌన్సెలర్లకు శిక్షణ ఇచ్చామని ఇంటర్ విద్య ఆర్‌జేడీ ఐ.శారద తెలిపారు. రెండు కళాశాలల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 120 మందికి శిక్షణ ఇచ్చామని.. వారు ఆయా కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. కాగా ఆర్ఐవో ఎన్ఎస్ఎల్ నరసింహం, డీఈసీ మెంబర్లు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



రాజమహేంద్రవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆదిరెడ్డి శ్రీనివాస్



గోకవరంలో నెహ్రూ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

టీడీపీ మేనిఫెస్టో అందరికీ ఉపయుక్తం

● భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నేత ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: తెలుగుదేశం పార్టీ రూపకల్పన చేసిన మేనిఫెస్టో రాష్ట్రంలో ప్రజలందరికీ ఎంతో ఉపయుక్తమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం 49వ డివిజన్‌లో మూడో రోజు టీడీపీ నాయకులు దుత్తరపు గంగాధర్, సేమాలి శ్రీను ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. దీనికి ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోను కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో జగన్ పరిపాలనలో అన్ని రంగాలు తీవ్రంగా నష్టపోయాయని చెప్పారు. మౌలిక సదుపాయాలు లేక కొన్ని ప్రాంతాలు దారుణంగా మారాయన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు తీరు దాచుకోచుకో అని అన్నింటిలోను కమిషన్ తీసుకుని అభివృద్ధి అంటే రంగులు, రాళ్ళు, నాణ్యత లేని పనులతో కాలం గడిపేశారని అన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర కష్టాలో ఉన్నప్పటికి అనుభవజ్ఞుడైన తమ నాయకుడు చంద్రబాబు అద్భుతమైన పాలన అందించారని గుర్తుచేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం కష్టాలో ఉన్న ప్రజలకు రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలకు లబ్ధి

అనపర్తి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూరుతుందని టీడీపీ నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి అన్నారు. బుధవారం అనపర్తిలో నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో సూపర్ సిక్స్ పథకాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాల్సిన అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో మహిళా నేతలు ఒంటిమి గౌతమి, పోతంశెట్టి సుభాషిణి, కె నాగమణి, కర్రి సత్యవతి, సిరసపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట మండలం జి.దొంతమూరులో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సతీమణి నల్లమిల్లి మహాలక్ష్మి బుధవారం మహాశక్తి ప్రచారంలో భాగంగా టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాల ద్వారా చేకూరే లబ్ధిని వివరిస్తూ ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అళ్ల గోవింద్, రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి సీలపాల త్రిమూర్తులు, మండల



అనపర్తిలో సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేస్తున్న తెలుగు మహిళా నేతలు

అధ్యక్షుడు వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, అనపర్తి టీడీపీ మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు ఎదురుచూపు

గోకవరం: వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి పాలనపై రాష్ట్ర ప్రజలు విరక్తితో ఉన్నారని, ఎన్నికలు వస్తే ఇంటికి పంపేందుకు ఎదురుచూస్తున్నారని జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని తంటికొండ గ్రామంలో వైసీపీకి చెందిన సుమారు 100 కుటుంబాలు బుధవారం నెహ్రూ సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, కక్ష సాధింపులతో సీఎం జగన్ పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. అనంతరం వైసీపీ కార్యకర్తలకు నెహ్రూ పార్టీ కండువాలను కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బదిరెడ్డి అచ్చన్నదొర, గెడ్డం బాబు, బదిరెడ్డి రవి, పెద్దాడ వెంకన్నదొర, దాసరి సీతారాం, సిరి, నాగం వెంకటపతి పాల్గొన్నారు.

సీటు ఎవరికి వచ్చినా కలిసి పనిచేద్దాం : బీవీఆర్ చౌదరి

సీతానగరం: సీటు ఎవరికి వచ్చినా అందరం కలిసి పనిచేద్దామని కూటమి గెలుపునకు కలిసి పనిచేద్దామని టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి కార్యకర్తలకు సూచించారు. బుధవారం ఆయన చినకొండేపూడిలోని కాండ్రుశేఖర్ గృహంవద్ద కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాలకు కట్టుబడి వచ్చే ఎన్నికలలో వైసీపీని ఇంటికి పంపించేందుకు జనసేన,తెలుగుదేశం కూటమిని బలపర్చాలన్నారు. కార్యకర్తలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, చౌదరిలు ఎవరికి మద్దతిస్తే వారికి ప్రచారంచేసి విజయం కోసం పోరాడతామని ఆయనకు మాటిచ్చారు. ప్రస్తుతం రాజానగరం సీటు ఇంకా పూర్తిస్థాయిలో ఏ పార్టీకి కేటాయించలేదని తెలుస్తోంది.

వైభవంగా నరసింహస్వామి అధ్యయనోత్సవాలు



కోరుకొండ: ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తున్న అనంత పద్మనాభ స్వామి



రంగంపేట: వడిశలేరులో శ్రీభజేన్నారాయణస్వామి వారి కల్యాణం దృశ్యం

కోరుకొండ, ఫిబ్రవరి21: కోరుకొండ తిరునాళ్ళ పేరుతో ప్రారంభమైన శ్రీ లక్ష్మినరసింహస్వామి అధ్యయన మహోత్సవాలు 2వ రోజు బుధవారం స్వామి వారికి కొండపైన తీర్థ బింది సేవ, తిరుప్పొల్లాడు, తొళక్కం నిర్వహించారు. అధ్యాపక స్వాములు ఇరగవరపు కృష్ణమాచార్యులు, చక్రవరి ఆచార్యులు, మార్గపురి నరసింహాచార్యులు, తదితరులు స్వామివారి అధ్యయనోత్సవాలు సందర్భంగా కొండపైన ఉదయం సాయంత్రం ప్రత్యేక సేవాకాలం నిర్వహించారు. అనంతరం రాత్రి శ్రీభూ సమేత అనంత పద్మనాభ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ గ్రామోత్సవంలో ఆలయ అనువంశకధర్మకర్తలు పరాసర లక్ష్మినరసింహ భట్టర్, పరాసర రంగరాజ భట్టర్, అర్చక స్వాములు చంటిబాబు, నాగు, గిరిధరాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చందన యాత్ర మహోత్సవాలు

రాజమహేంద్రవరం కల్చరల్ : స్థానిక కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి క్షేత్రంలో బుధవారం 22వ వార్షిక చందన యాత్రమహోత్సవాల ముగింపు సందర్భంగా భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్యసింహాచలం, కాలెపు నాగేశ్వర రావు ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు అమరాల శ్రీకిరణ్ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం 10గంటల నుంచి భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం, ద్వాద శారాదనలు, మహా పూర్ణాహుతి నిర్వహించారు. చందనయాత్ర మహోత్సవాలకు సహాయ సహకారాలు అందించిన విద్యుత్‌శాఖ, పోలీసుశాఖ సిబ్బందికి, నగరపాలక అధికారులకు, సిబ్బందికి, ఆలయ ధర్మకర్తలు కాలెపు సూర్య సింహాచలం, కాలెపు నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా శ్రీ భజేన్నారాయణస్వామివారి కల్యాణం

రంగంపేట: రంగంపేట మండలం వడిశలేరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ భజేన్నారాయణస్వామి వారి కళ్యాణం మంగళవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ముమ్మన రాంబాబురెడ్డి, మాజీ ధర్మకర్తల మండలి చైర్మన్ మావిరెడ్డి వీర్రాజు, సభ్యుల వల్లూరి సూర్యబాస్కరరావు దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం చేసిన విద్యార్థులను అభినందించి మెమోంటోలు అందజేశారు. కళ్యాణం అనంతరం వచ్చిన భక్తులకు అందరికీ స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి అళ్ళ గోవింద్,గ్రామస్తులు స్వామివారి దర్శించుకున్నారు.

'ఆలయాల అభివృద్ధే ధ్యేయం'

గోకవరం : హిందూ ఆలయాల అభివృద్ధే తన ధ్యేయమని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేవ వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. కోరుకొండ మండలం గరగలంపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం జరిగిన విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి రామసేన సభ్యులు హాజరై శ్రీనివాసరావు సమకూర్చిన లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. గాదరాడలో రామాలయం అభివృద్ధి పనులకోసం రూ.10,000లను ఆర్థిక సహాయంగా కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా రామసేవ వ్యవస్థాపకుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి పనులలో భాగంగా ఏడు మండలాల్లోని 50 గ్రామాల్లో ఆలయాల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు తామర్ల రాంబాబు, మామిడి అయ్యప్ప, ఇనగోటి బావన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధశర్మ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

కోరుకొండ: మండలంలోని గాదరాడ గ్రామంలో నూతన రామాలయం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. గత మూడురోజులుగా వేద పండితులు రామాలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి సంబంధించి శాస్త్రోక్తంగా నిర్వహించిన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బత్తుల బలరామకృష్ణ, కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఈ సందర్భంగా రామాలయ నిర్మాణ కమిటీ కి బత్తుల బలరామకృష్ణ రూ.3లక్షలు విరాళాన్ని అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ బలరామకృష్ణను ఘనంగా సత్కరించారు. అదే విధంగా తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.10లక్షలు గ్రాంటును గాదరాడలో నూతన రామాలయ నిర్మాణానికి మంజూరు చేయించారని కమిటీ వారు తెలిపారు. రామాలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో సర్పంచ్ దూది కాంతారావు, ఎంపీటీసీలు, వైసీపీ, టీడీపీలకు చెందిన నాయకులుప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాదరాడలో నూతన రామాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం దృశ్యం

భక్తిశ్రద్ధలతో స్వామివార్ల విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం

దివాన్‌చెరువు : సంపత్‌నగరంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీసీతారామలక్ష్మణ, శ్రీవిఘ్నేశ్వర, శ్రీకృష్ణ, ఆంజనేయ, శిఖరయంత్ర ప్రతిష్ఠా మహోత్సవం ఆగ్రామంలోని శ్రీసీతారామాలయం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. ఉదయం గం.8.03 నిమిషాలకు విగ్రహప్రతిష్ఠా మహోత్సవం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురోహితులు గాడేపల్లి వీరభద్రశర్మ శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం జరిగిన అన్నసమారాధనకు స్థానికులతో పాటు పరిసర గ్రామాల భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడిరాజా, టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ దంపతులు, వైసీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

నేడు చలో సెక్రటేరియట్‌ను జయప్రదం చేయాలి

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 21: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గురువారం కాంగ్రెస్‌పార్టీ తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచరయ్య కాంగ్రెస్ శ్రేణులను బుధవారం కోరారు. రాష్ట్రంలో దాదాపు 50 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 6వేల పోస్టులకు మాత్రమే డీఎస్సీని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దగా డీఎస్సీ వద్దు, మెగా డీఎస్సీని ప్రకటించాలని, నిరుద్యోగుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వీజే కళాశాల అధ్యాపకురాలికి పీహెచ్‌డీ



లక్ష్మీప్రసన్నను అభినందిస్తున్న వీజే కళాశాల యాజమాన్యం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 21:స్థానిక వీజే ఫార్మసీ కళాశాల అధ్యాపకురాలు ఎం.లక్ష్మీప్రసన్నకు ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర బుధవారం తెలిపారు. ఫార్మాస్యూటికల్స్ విభాగంలో రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించే ఔషధంను సహజ పోలిమర్లను ఉపయోగించి గ్యాస్ట్రోరిటెంటివ్ ఫ్లోటింగ్ ఓరల్ ఇన్‌సిటుజెల్‌ను అభివృద్ధి చేసే అంశంపై ఆమె పరిశోధన చేశారన్నారు. ఆమె పేరుపై మూడు పేటెంట్లు కూడా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్నకు కళాశాల కరస్పాండెంట్ ఎస్వీవీపీ జగన్మోహనరెడ్డి, చైర్‌పర్సన్ ఎన్.శకుంతల పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

రాజమహేంద్రవరంకల్చరల్, ఫిబ్రవరి 21: తెలుగువారి ప్రతిఒక్కరిపైన తన భాష, సంప్రదాయాన్ని, ఆచార వ్యవహారాలను కాపాడుకోవలసిన బాధ్యత ఉందని ప్రముఖ ఆంత్రోపాలజిస్టు సన్నాడి వెంకటరమేష్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో కళా గౌతమి, తెలుగు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద జాతి తెలుగు జాతేనని, మన భాషా సాహిత్యాలలో ఉన్న అపురూప భావసంపద మరి ఏ ఇతర భాషలలోనూ లేదని తెలిపారు. సభను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ ఏబెల్ రాజబాబు మాట్లాడుతూ తెలుగు భాషను ప్రపంచ మేధావులందరి చేత కొనియాడిన భాషగా అభివర్ణించారు. ఈ సభకు డాక్టర్ పీవీ సంజీవరావు అధ్యక్షత వహించగా ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణశ్రీ, ముఖ్య వక్తను సభకు పరిచయం చేశారు. చీర్ల సీతారామానాయుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించగా, జి.శరత్ బాబు,పల్లి సుధ, ఏ.సరళ, డి.విశాల్ తదితర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గైట్ ఫార్మసీ విద్యార్థులు



రాజానగరం, ఫిబ్రవరి 21: తమ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జిల్లాస్థాయి యువ పార్లమెంట్ పోటీలో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు గైట్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.డి. ధనరాజు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 20న జిల్లాస్థాయిలో జాతీయ యువ పార్లమెంట్ పేరుతో నిర్వహించిన వర్చువల్ మోడ్ వక్తృత్వ పోటీలో ప్రతిభ చూపారన్నారు. ఈ పోటీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కౌశికినా గిడియోస్, ఎ.పావని ప్రథమ స్థానాల్లో నిలిచారు. ఎం.సాయిశ్రీ ఫణీషా ద్వితీయస్థానం లభించింది. తూర్పుగోదావరి, కాకినాడజిల్లా మేకింగ్ ఇండియా ఇన్ గ్లోబల్ లీడర్ అనే అంశంపై మాట్లాడారు. జి.నితీష్ శ్రీకర్ ఏలూరు జిల్లా నుంచి ఆత్మనిర్భర్ భారత్ నుంచి వికసిత్ భారత్ అనే అంశంపై మాట్లాడి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఫిబ్రవరి 24న రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎం.డి.ధనరాజు తెలిపారు.

ఘనంగా సత్తెమ్మ జాతర



మెళ్లూరులో సత్తెమ్మను దర్శించుకుంటున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, ఫిబ్రవరి 21: మెళ్లూరు గ్రామ దేవతగా పూజలందుకుంటున్న సత్తెమ్మ అమ్మవారి జాతర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారిని రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈయన వెంట టీడీపీ నేతలు శ్రీను, బాబ్జి, గంగరాజు, సీతారామయ్య, సత్య, నూకరాజు, అర్జున్, జనసేన నాయకులు వీర్రాఘవులు పాల్గొన్నారు.

పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

కడియం, ఫిబ్రవరి 21: పోలియోరహిత సమాజం కోసం వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో జి రాజేమనోజ్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో వైద్యసిబ్బందికి అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వచ్చేనెల 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో 64 కేంద్రాల ద్వారా పోలియో చుక్కలు వేయడానికి కృషి చేయాలన్నారు.

ఘనంగా శ్రీరామ స్తూప వార్షికోత్సవం

బిక్కవోలు, ఫిబ్రవరి 21: కొంకుదురు బుడతలమామిడి వద్ద ఉన్న శ్రీరామ స్తూప 35వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన గొలుగూరి రామచంద్రారెడ్డి పార్వతి దంపతులు పీటలపై కూర్చుని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. కల్యాణ క్రతువును అర్చకులు శ్రీనివాసశర్మ నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనపర్తి, ఫిబ్రవరి 21 : అనపర్తి మండలంలోని దుప్పలపూడి, అనపర్తి, కుతుకులూరు గ్రామాలలోని మూడుసబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్స్ దాట్ల శ్రీదర్‌వర్మ బుధవారం విలేకరులకు తెలిపారు. మూడు సబ్ స్టేషన్ల పరిధిలో గల ఫీడర్లు మరమ్మతుల నిమిత్తం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నంవరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

వైభవంగా సుదర్శన హోమం

కడియం, ఫిబ్రవరి 21: దుళ్ళలో శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సుదర్శన హోమం ఘనంగా జరిగింది. ఉదయం సుప్రభాతసేవ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ, స్వామివారికి సింహవాహనసేవ కన్నుల పండుగగా జరిగింది. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు, వేదపండితులు ఖండవిల్లిరవి ఆధ్వర్యంలో రుత్వికులు హోమాన్ని నిర్వహించారు. స్వామి వారు సింహవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



దుళ్ళలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పూజా కార్యక్రమాలు

వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పాడండి

రాజానగరం, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న వైసీపీ నిరంకుశత్వ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాజానగరం అసెంబ్లీ కో-కన్వీనర్ ఆడబాల గణపతిరావు అన్నారు. ప్రజాపోరు యాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సీతారాంపురం, రాజానగరం గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రజాపోరు యాత్రలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ నాయకులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 22 ఫిబ్రవరి 2024 | 5

ఏపీ హక్కులు.. ఢిల్లీలో తాకట్టు సిగ్గుచేటు



ప్రత్యేక హోదా కోరుతూ చేపట్టిన రిలే దీక్షలకు మద్దతు తెలుపుతున్న చలసాని

- ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన మోదీ ప్రభుత్వం
- జగన్ కేంద్రంపై పోరాటం చేయకపోవడం అన్యాయం
- ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్.. రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 21: మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు తీరని ద్రోహం చేసిందని, అయినా జగన్ కేంద్రంపై పోరాటం చేయకపోవడం అన్యాయమని, ఏపీ హక్కులను ఢిల్లీలో తాకట్టు పెట్టడం సిగ్గుచేటని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ రాజమహేంద్రవరం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు చలసాని శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మీడియాతోను, అక్కడకు వచ్చిన విద్యార్థులతోను మాట్లాడారు. పార్టీలకు అతీతంగా రాష్ట్ర యువత తమకు రావాల్సిన న్యాయమైన హక్కులకోసం పోరాటం చేయాలని, ప్రత్యేక హోదాతోనే యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి తొత్తులుగా మారి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంటును ఇప్పటికైనా కాపాడాలని కోరారు. రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలుచేయకుండా రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రిలే నిరాహారదీక్షలు చేసిన కృష్ణచైతన్య, పొన్నల దినకరన్‌లకు చలసాని శ్రీనివాస్‌తోపాటు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్, బి.రాజులోవ, ఎస్ రాజా, డాక్టర్ చైతన్య శేఖర్, వివిధ కార్మిక సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు నిరాహారదీక్షలకు మద్దతు తెలిపారు. రాజమహేంద్రి మహిళా కళాశాల విద్యార్థినిలు ఈ రిలే దీక్షా శిబిరానికి మద్దతుగా పాల్గొన్నారు.



మళ్లీ.. పోలీస్ యాక్ట్ 30

- ప్రతిపక్షాల లక్ష్యంగానే తాజా నిర్ణయమా
- రాజమహేంద్రవరం టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ సెక్షన్ అమలు
- మంత్రి వేణు కోసమేనా ఈ హడావుడి?

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ మళ్లీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 30ని తెరపైకి తెచ్చారు. సౌత్‌జోన్ పరిధిలోని టూటౌన్, ధవళేశ్వరం, కడియం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆ సెక్షన్ అమలులోకి తెచ్చినట్టు డీఎస్పీ అంబికా ప్రసాద్ తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించడం నేరమని పేర్కొన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాంతిభద్రతలు నియంత్రించడంలోని ముందస్తు చర్యల్లో భాగంగా ఈ సెక్షన్ ప్రయోగించామని పోలీసులు చెబుతున్నారు. కానీ ఈ జోన్ పరిధిలోని ఈ సెక్షన్ పెట్టాల్సిన కారణాలపై పోలీసుల వద్ద సమాధానం లేదు. రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి మంత్రి వేణు పోటీలో ఉన్నట్టు చెబుతున్న విషయం తెలిసిందే. దీంతో ఆయన అక్కడ ఎక్కువగా పర్యటిస్తున్నారు. ఆ కార్యక్రమాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత డీఎస్పీని ఏరికోరి మంత్రి తీసుకొచ్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం గతంలోనే 'ఆంధ్రజ్యోతి' స్పష్టంచేసింది. ఇప్పుడు ఆయన జోన్ పరిధిలోనే సెక్షన్ 30 విధించడం గమనార్హం. మంగళవారం రాత్రి హోంమంత్రి తానేటి వనిత కాన్వాయ్‌ని కాంగ్రెస్ నాయకులు మెగా డీఎస్సీలో మోసంపై నిలదీస్తూ అడ్డుకున్నారు. ఆ క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని త్రీటౌన్ స్టేషనుకు తరలించారు. ఈ నిరసన త్రీటౌన్ స్టేషనుకు దగ్గరలోనే జరిగింది. ఈ ప్రాంతం సెంట్రల్ జోన్ పరిధిలోకి వస్తుంది. కానీ సౌత్‌జోన్ పరిధిలో అంటే మంత్రి వేణు పోటీలో ఉన్నానని చెప్పుకొంటున్న ప్రాంతంలో సెక్షన్ 30 అమలు చేయడంపై విమర్శలు వినవస్తున్నాయి. గతంలో చంద్రబాబు జైలులో ఉన్న సమయంలో ఈ సెక్షనును సుదీర్ఘంగా అమల్లో ఉంచారు. అయితే అప్పట్లో ప్రతిపక్షాలపై కేసులు పెట్టి.. నగరం నడిబొడ్డున గుంపులుగా రోడ్లపై వేడుకలు చేసుకున్న వైసీపీ నాయకులను వదిలేయడం గమనార్హం.



రాజమహేంద్రి చుట్టూ రాజకీయం

- హీట్ పెంచిన పవన్ పర్యటన
- రాజానగరాన్ని వీడని ఉత్కంఠ
- రూరల్ సీటుపై కందుల ధీమా
- అయోమయంలో గోరంట్ల
- రాజానగరంపై స్పష్టతలేని వైనం
- రాజానగరంపై బత్తుల ఆశలు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం చుట్టూ రాజకీయం హీటెక్కుతోంది. జనసేనాని పవన్‌కల్యాణ్ పర్యటనతో ఇది మరింత సెగ పుట్టించింది. రాష్ట్రం అంతా ఒక ఎత్తు తూర్పుగోదావరి మరో ఎత్తు అనే చందంగా పరిస్థితి మారిపోయింది. టీడీపీకి ముందు నుంచీ 'తూర్పు'లో పట్టు ఎక్కువే. పైగా ఇప్పుడు టీడీపీ-జనసేన కూటమికి రాష్ట్రంలో అధికారం ఖాయమనే మూడ్‌లో జనం ఉండడంతో ఈ జిల్లాలోని సీట్లపై టీడీపీ, జనసేన, బీజేపీ ఆచితూచి ఆలోచన చేస్తున్నాయి. ఆశావహుల్లో మాత్రం ఉత్సాహం ఉరకలు వేస్తోంది. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన తమ అభ్యర్థుల ప్రకటనపై అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నాయి. మంగళవారం జనసేనాని రాజమహేంద్రవరంలో పర్యటించిన సందర్భంలోనూ ఇదే స్పష్టమైంది. ఓ వైపు జనసైనికులకు ఉద్బోధ చేస్తూనే టీడీపీ నేతలతో పవన్‌కల్యాణ్ మంతనాలు జరుపుతూ పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళుతున్నారు. గతంలో టీడీపీతో పొత్తును పవన్ ఇక్కడి నుంచే ప్రకటించడం కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఏదేమైనా రాజానగరం నియోజకవర్గం, రాజమహేంద్రవరం రూరల్ ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. ఇక్కడ ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను ఖరారు చేయకపోవడం గమనార్హం. మరోవైపు వైసీపీలో గందరగోళం కొనసాగుతూనే ఉంది. ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను నియమించినా, నామినేషన్ వేసే వరకూ టిక్కెట్ వస్తుందనే నమ్మకం లేదని ఆ పార్టీలో సైతం చర్చ జరుగుతోంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో రాజానగరం సీటు ఇప్పుడు గరంగరంగా మారింది. రాజమహేంద్రవరం రూరల్ విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జనసేన జిల్లా అధ్యక్షుడు దుర్గేష్ రూరల్ సీటు తనకు కన్ఫర్మ్ అయిందని చెబుతున్నా పూర్తిస్థాయిలో స్పష్టత రావడంలేదు. ప్రస్తుత రూరల్ టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి కాస్త వేచిచూసే ధోరణిలోనే ఇప్పటికీ ఉన్నారు. ఇక్కడ నుంచి ఎవరు పోటీ చేయాలనేది తమ పార్టీ అధినేత చంద్రబాబు, జనసేనాని అధినేత పవన్‌కల్యాణ్‌లు ఉమ్మడిగా ప్రకటిస్తారని తన అనుచరులతో చెబుతూ వస్తున్నట్టు సమాచారం. ఇటు జనసేనాని పవన్ మంగళవారం రాజమహేంద్రవరంలోని తమ పార్టీ కార్యాలయంలో అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజకవర్గాలకు చెందిన ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులతో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ భేటీలో రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్‌పైనే ఎక్కువ చర్చ జరిగినట్టు తెలుస్తోంది. రాజానగరం నుంచి జనసేన పోటీ చేస్తుందని పవన్‌కల్యాణ్ గతంలోనే ప్రకటించడంతో అక్కడి నుంచి ఎవరు బరిలో ఉంటారనే విషయంపై ఉత్కంఠ నెలకొంది. తనకే సీటు దక్కుతుందని బత్తుల బలరామకృష్ణ నమ్మకంతో ఉండగా మంగళవారం సమావేశంలో ఎటూ తేల్చకపోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో టీడీపీ నుంచి తానే పోటీలో ఉంటానని ఆ పార్టీ సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జనసేన నుంచి బరిలో తానేనని కందుల దుర్గేశ్ ఎప్పటి నుంచో చెబుతూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ సీటుపై కూడా జనాల్లో చర్చ నడుస్తోంది. మంగళవారం సమావేశం అనంతరం రూరల్ తనకే ఖాయం చేశారని కందుల స్పష్టంచేయడం, అధిష్ఠానం నిర్ణయిస్తుందంటూ గోరంట్ల చెప్పడం చూస్తుంటే ఏక్షణంలో ఏ నిర్ణయం వస్తుందోననే ఉత్కంఠ పెరిగిపోయింది. మరోవైపు రాజానగరం స్థానంలో జనసేన ఎవరిని పోటీకి దింపుతుందో చూసి సమఉజ్జీని బరిలో నిలపాలనే వైసీపీ వేచివుందని తెలుస్తోంది. ఇక్కడి నుంచి జనసేన అగ్రనేత ఎవరైనా పోటీకి దిగుతారా? అనే ఊహాగానాలు కూడా ఉన్నాయి. ఇదిలా ఉండగా రాజమహేంద్రవరం పవన్ కల్యాణ్ వచ్చినప్పుడు టీడీపీ నాయకులతోనూ సమాలోచనలు జరిపారు. టీడీపీ నాయకులు ఆదిరెడ్డి శ్రీనివాస్, అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ నాయకులు హరీశ్‌మాధుర్‌తో సుమారు గంటపాటు చర్చించారు. దీనిపై కూడా ఉత్కంఠ నెలకొంది. ఇక రాజమహేంద్రవరం ఎంపీ సీటు వైసీపీ నుంచి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌కి దక్కడంతో ఆయన క్షేత్రస్థాయి పర్యటనల్లో నిమగ్నమయ్యారు. పొత్తులో భాగంగా ఇక్కడ నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల్లో ఏ పార్టీ నుంచి అభ్యర్థి ఉంటారోననే సందిగ్ధం నెలకొంది. టీడీపీ లేదా బీజేపీ నుంచే ఎంపీ స్థానంలో బరిలో ఉంటారనే వాదన ఉంది. బీజేపీ నుంచి పురందేశ్వరి రేసులో ఉన్నారని చెబుతున్నా ఆమె విశాఖ కోరుతున్నారని అంటున్నారు. ఒకవేళ విశాఖ నుంచి ఆమె పోటీకి దిగితే బాలకృష్ణ చిన్నల్లుడు భరత్‌ని రాజమహేంద్రవరం నుంచి బరిలో నిలపాలనే ఆలోచనలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఇక్కడ రాజకీయం వేడెక్కిందనే చెప్పాలి.

బీసీలకు జీవం పోసిన ఘనత టీడీపీదే

శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్



సమావేశంలో మాట్లాడుతున్న కుడుపూడి సత్తిబాబు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: శెట్టిబలిజ గౌడ, శ్రీశయన, యాత, ఈడిగలను గుర్తించి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా చేసిన ఘనత, స్థానిక సంస్థల్లో బీసీలకు జీవంపోసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని ఆ పార్టీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2024 ఎన్నికల్లో గెలిచి సీఎం కావడం, రాజమహేంద్రవరం ఎమ్మెల్యేగా ఆదిరెడ్డి శ్రీనివాస్ అఖండ విజయం సాధించడం తథ్యమన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 18న ఆనంద్ రీజెన్సీ పందిరిహాలులో తాము నిర్వహించిన శెట్టిబలిజ గౌడ ఆత్మీయ సమావేశం విజయవంతంకావడంతో వైసీపీ వారు ఓర్వలేక తమపై విమర్శలు చేశారన్నారు. వైసీపీలో ఇప్పుడు అవాకులుచవాకులు పేలుతున్న నాయకులకు గుర్తింపునిచ్చి రాష్ట్రస్థాయి పదవులను ఇచ్చింది టీడీపీయేనని అన్నారు. రాజమహేంద్రంవరంలో ఆదిరెడ్డి శ్రీనివాస్ కుటుంబాన్ని నేరుగా ఎదుర్కొనే దమ్ము, సత్తా లేక అడ్డగోలుగా బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, కానీ రాజమహేంద్రవరంలో ఉన్న శెట్టిబలిజ, గౌడలంతా కలిసి వాసును ఎమ్మెల్యేగా నెగ్గిస్తామన్నారు. టీడీపీ నగర బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడ్డిగ గోపాలకృష్ణ, నగర అధ్యక్షుడు బుడ్డిగ రవి తదితరులు పాల్గొన్నారు.



ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డైరీని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత ఆవిష్కరించారు. బుధవారం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్‌రాజు, జిల్లా అధ్యక్షుడు ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి భరత్‌రాజు, మహిళా విభాగం కార్యదర్శి రాజకుమారిలు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డైరీని ఆవిష్కరింపజేశారు.

జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా మోతా శారద



జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శారదను అభినందిస్తున్న అమర్‌జా బేగ్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీలో అందరికీ సముచిత స్థానం ఉంటుందని, అందులో భాగంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మోతా శారదను నియమించారని ఏపీసీసీ సభ్యురాలు అమర్‌జా బేగ్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మార్టిన్ లూథర్ ఆధ్వర్యంలో కోర్లంపేట పార్టీ కార్యాలయంలో నూతన జిల్లా తొలి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారదకు నియామక పత్రాన్ని వారు అందించారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో అమర్‌జా బేగ్ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అన్యాయాలను అరికట్టేందుకు శారద నాయకత్వంలో మహిళా కాంగ్రెస్ కృషి చేస్తుందన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మార్టిన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. నూతన అధ్యక్షురాలు మోతా శారద మాట్లాడుతూ తన నియమకం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అవకాశం కల్పించిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ, పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శాంతియాకుమారి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మహిళా సమస్యలపై పోరాడతామన్నారు. ఈ సమావేశంలో పీసీసీ కార్యదర్శి జేవ్య సతీష్‌బాబు, కిసాన్ సెల్ నాయకుడు కాకర్ల హరిబాబు, నలబాటి శ్యామ్, జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రఫుల్లాబేగ్, డాక్టర్ వడయార్, జక్కంపూడి సత్తిబాబు, వీవీఆర్ చౌదరి, కాటం రవి, వెలగా రామకృష్ణ, ముప్పిడి శ్రీనివాస్, బండి భాస్కర్, కిషోర్‌కుమార్ జైన్, నల్లా వీర్రాజు, దోసపూడి సత్యప్రసాద్, ఉల్లిశెట్టి సత్తిబాబు, పిట్టా రామారావు, లక్కొండ డేవిడ్ రాజులు పాల్గొన్నారు.

మీడియాపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఎస్ జవహర్

కొవ్వూరు, ఫిబ్రవరి21: మీడియాపై దాడిని ప్రజాస్వామ్యంపై దాడిగానే చూడాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అన్నారు. గురువారం కొవ్వూరులోని రాజమహేంద్రవరం పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో జవహర్ పాత్రికేయులతో మాట్లాడారు. జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మీడియాపై దాడులు పెరిగాయన్నారు. ఆయనకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురిస్తున్నారనే దురుద్దేశంతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, ఈనాడు, టీవీ5 వంటి మీడియా సంస్థలు, పాత్రికేయులపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులకు పరాకాష్టగా అనంతపురం జిల్లా రాప్తాడులో సిద్ధం సభ కవరేజ్‌కు వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కక్షపూరితంగా దాడి చేశారన్నారు. రానున్న రోజుల్లో మీడియాను భయభ్రాంతులకు గురిచేస్తే వాస్తవాలు రాయకుండా ఉంటారని జగన్మోహనరెడ్డి కుట్ర అని మనమందరం అర్థం చేసుకోవాలన్నారు. మీడియాపై జరిగిన దాడులను బయటకు వచ్చి ఖండించకపోతే సమాజానికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి వస్తుందన్నారు. వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే వాహకాలు భయభ్రాంతులకు గురైతే ప్రజలకు నష్టం కలుగుతుందన్నారు. జీవనం కష్టంగా వెళ్తున్న పాత్రికేయులపైనా, పేదలు, బడుగు, బలహీనవర్గాలపైన దాడిచేయడం తగదన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేటటువంటి పాత్రలో కచ్చితంగా పాత్రికేయులకు టీడీపీ అండగా ఉంటుందని స్పష్టంచేశారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం : శేషారావు

నిడదవోలు, ఫిబ్రవరి21: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలుచేస్తోందని, పత్రికాస్వేచ్ఛకు భంగం కలిగిస్తూ పాత్రికేయులపై దాడికి పాల్పడుతున్న వైసీపీ గుండాల దాడిని ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారని నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. బుధవారం నిడదవోలులో ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న పాత్రికేయులపైనా, పాత్రికేయ సంస్థలపైనా వైసీపీ గుండాలు దాడులకు పాల్పడ్డం దుర్మార్గమైన చర్య అన్నారు. జగన్‌రెడ్డి పరిపాలనలో ఈ నాలుగున్నర సంవత్సరాలు అభివృద్ధి అథోగతి పాలైందని, సైకో పాలనను సాగనంపేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని అన్నారు.



ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి పంపిన లీగల్ నోటీసు ప్రతిని విలేకరులకు చూపుతున్న నల్లమిల్లి

ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి నల్లమిల్లి లీగల్ నోటీసు

- కోర్టు పరిధిలో ఉన్న అంశంపై అసత్య ప్రచారాలు చేస్తున్నందుకు న్యాయపోరాటం
- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 21 : హైకోర్టు పరిధిలో ఉన్న అంశంపై అసత్య ఆరోపణలు చేస్తూ కోర్టు తీర్పులను వక్రీకరిస్తూ పబ్లిసిటీ చేస్తున్న అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం లీగల్ నోటీసులు పంపించారు. ఈ సందర్భంగా అనపర్తిలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నోటీసు వివరాలను వెల్లడించారు. బిక్కవోలు మండలం కాపవరం గ్రామంలో నాగార్జున ఫెర్టిలైజర్స్ సంస్థకు చెందిన 197 ఎకరాల్లో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అక్రమ మైనింగ్, చెట్ల నరికివేతపై తాను హైకోర్టులో రిట్ దాఖలు చేశానని, దీనిపై న్యాయస్థానం అక్కడ అక్రమ మైనింగ్, చెట్ల నరికివేతపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించి అక్రమ తవ్వకాలపై నిర్ధారణకు వచ్చిందని, దీంతో ఎమ్మెల్యే తాను నాగార్జున మెట్టను ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలనుకుంటే రామకృష్ణారెడ్డి కోర్టులో కేసు వేసి స్టే తెచ్చారని, అందుకే స్థలాలు ఇవ్వలేకపోతున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారని, దీనిపై సమాధానం చెప్పాలని కోర్టు ద్వారా నోటీసులు పంపానని నల్లమిల్లి తెలిపారు. నాగార్జున మెట్టపై అక్రమ మైనింగ్ జరిగిందని హైకోర్టు ధ్రువీకరించినప్పటికీ అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అందుకే కోర్టు ద్వారా లీగల్ నోటీసులు పంపడం జరిగిందన్నారు. టీడీపీకి పెరిగిన ఆదరణ చూసి ఓటమి తథ్యమని భావించి డమ్మీ పట్టాల పంపిణీకి అధికార పార్టీ నాయకులు తెరతీశారని, ఏడాదిన్నర కిందట రైతుల నుంచి సేకరించిన 58 ఎకరాల భూమికి నేటికీ ఒక్క రూపాయి చెల్లించలేదని పేదలను మోసగించేందుకు డమ్మీ పట్టాలు తయారు చేసి పంపిణీ చేస్తున్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకర రెడ్డి, మల్లిడి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత

జిల్లాలో కొత్తగా 16,875 ఓట్లు : కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 21: ఓటరు నమోదు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, ఓటు హక్కు కలిగి తమ ఓటు బదిలీకోసం తప్పనిసరిగా ఫారం 8 ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత అన్నారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు తొలగింపు విధానంలో 0.1 శాతం కంటే ఎక్కువ జరిగిన సందర్భంలో సంబంధిత వివరాలు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు నివేదికలు పంపడం జరుగుతుందన్నారు. డిసెంబరు 10 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు పరిష్కారం చేసిన వివరాలు రాజకీయ పార్టీలకు అందజేసినట్టు తెలిపారు. కొత్తగా ఓటర్ల నమోదుకోసం ఫారం6లు 18,843 రాగా 16,875 ఆమోదించడం జరిగిందని, 1968 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓటరు తొలగింపు కోసం ఫారం 7లు 19,679 రాగా 10,567 ఆమోదించడం జరిగిందని 9,112 పరిశీలనలో ఉన్నాయన్నారు. ఫారం 8లు 29,014 రాగా 26,894 ఆమోదించడం జరిగిందని, 2,120 పెండింగ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేఆర్ఆర్‌సీఎస్ డీటీ, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఏఆర్వో కృష్ణ నాయక్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా కలెక్టరేట్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.


తహసీల్దార్‌కి వినతి పత్రం అందిస్తున్న సచివాలయ కార్యదర్శులు

రేషనలైజేషన్ బదిలీలు తక్షణం నిలిపివేయాలి

తాళ్లపూడి, ఫిబ్రవరి 21: తాళ్లపూడిలో సచివాలయ కార్యదర్శులు రేషనలైజేషన్ బదిలీలు తక్షణం నిలిపివేయాలని తహసీల్దార్, ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందించారు. ప్రభుత్వం గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులంతా గడప గడపకూ సంక్షేమ పథకాలు, సేవలు అందిస్తూ ఉన్న వారిగా గుర్తిస్తున్నామని, ఇటీవల గ్రామ వార్డుసచివాలయ ఉద్యోగులకు రేషనలైజేషన్ పేరిట చేస్తున్న బదిలీలు బాధాకరమని తెలిపారు. సచివాలయాల్లో ఏ శాఖ ఉద్యోగి మరొక శాఖ ఉద్యోగికి ప్రత్యామ్నాయంకాదని సచివాయంలో కనీసం 8మంది ఉద్యోగులు ఉండాలన్నది సరైన నిబంధన కాదని పేర్కొన్నారు. బదిలీలయ్యే ఉద్యోగుల్లో అధిక శాతం మంది బీఎల్‌వోలుగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని ఎన్నికల అనంతరం సాధారణ బదిలీలలో రేషనలైజేషన్ చేయాలని ఇప్పటికిప్పుడు బదిలీల ద్వారా సచి వాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని ఎన్నిక లు అయ్యేంతవరకూ రేషనలైజేషన్ ప్రక్రియ నిలిపివే యాలని తద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని సచివాలయ ఉద్యోగ సంఘ జిల్లా కార్యవర్గ సభ్యుడు గెద్దం గణేష్ తెలిపారు. కార్యక్రమంలో మండల సచివాలయ సంఘ అధ్యక్షుడు ఇర్లపాటి వినీల్, కార్యదర్శి సాధనాల శ్రీను, కాకర్ల శ్యాంప్రసాద్, భారతి, తేజ పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో చెట్లు నరికివేత

నిడదవోలు, ఫిబ్రవరి 21: నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పచ్చని చెట్ల నరికివేతపై గ్రామస్థులు అసం తృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాటసారులకు వాహనదారులకు ఎన్నో ఏళ్లుగా నీడనిస్తున్న చెట్లను పంచాయతీ అధికార్లు ఎటువంటి ఆదేశాలు లేకుండా ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారని గ్రామస్థులు ఇప్పటికే తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు లేవని పలువురు గ్రామస్థులు వాపోతున్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన


కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో కళాజాత నిర్వహిస్తున్న బృందం

కొవ్వూరు, ఫిబ్రవరి 21 : ఎయిడ్స్ వ్యాధిపై మిరియాల రవిబాబు కళాజాత బృందం వీధినాటక ప్రదర్శన నిర్వహించారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణా మండలి ఆదేశాలమేరకు బుధవారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో కళాజాత బృందం బుర్రకథ ద్వారా ఎయిడ్స్ వ్యాధిపట్ల అవగాహన కల్పించారు. ఐసీటీసీ సెంటర్ ఆవశ్యకత, మందుల ప్రాధాన్యం గురించి వివరించారు. హెచ్ఐవీ టోల్ ఫ్రీ నెం.1097 గూర్చి ప్రజలకు ఆట, పాటలద్వారా అవగాహన కల్పించారు. ఐసీటీసీ కౌన్సిలర్ సత్యనారాయణ, ల్యాబ్ టెక్నీషియన్ ప్రసాద్, గుడ్ ల్యాంప్ టీంతో సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ వ్యక్తి ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి


సొగిపాడులో రామాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఇన్‌ఛార్జ్ మద్దిపాటి వెంకట్రాజు

గోపాలపురం, ఫిబ్రవరి 21: ప్రతీవ్యక్తికి ఆధ్యాత్మిక భావన కలిగినప్పుడే సమాజంలో చెడుకు స్థానం ఉండదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని దొండపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని సాగిపాడులో నిర్మించిన నూతన రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అయన బుధవారం పాల్గొన్నారు. అయన మా ట్లాడుతూ సమాజం పురోగాభివృద్ధి చెందాలన్న, వ్యక్తిత్వంలో గుణ లక్షణాలు పెంపొందించుకోవాలన్న ఆధ్యాత్మిక చింతన అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముత్యాలరాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరులో ప్రజా ఆశీర్వాద కార్యక్రమం


కొవ్వూరు పట్టణంలో ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలారి

కొవ్వూరు, ఫిబ్రవరి 21 : కొవ్వూరు పట్టణంలోని 6,7,8 వార్డులలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం ప్రజా ఆశీర్వాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలుతీరును అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో కోడూరి శివరామకృష్ణ, బండి పట్టాభిరామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు మన్నె పద్మ, గండ్రోతు అంజలి, బావన రాజేష్, నగళ్లపాటి శ్రీనివాస్, గండ్రోతు శివ, ఏలూరి విజయలక్ష్మి, పోసిన శ్రీలేఖ, కవల నాగేశ్వరరావు, రుద్రం వీరబాబు, గోశాల శ్రీనివాస్, చౌటిపల్లి వీరన్న, పక్కి శ్రీనివాస్, తోట రామకృష్ణ, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం కుడి ప్రధాన కాల్వ వెంబడి పులి సంచారం


పొగాకు తోటలో పులి పాదముద్రలు పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

గోపాలపురం, ఫిబ్రవరి 21: మండలంలోని పెద్దాపురం, చెరుకుమిల్లి, వేలచింతలగూడెం గ్రామాలకు ఆనుకుని ఉన్న పోలవరం కుడిప్రధాన కాల్వ గట్టువెంబడి పులి సంచరిస్తుందన్న వార్తలతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నిన్నటివరకు బందపురం రెవెన్యూ పరిధిలో పెద్దపులి తిరుగుముఖంపట్టి పెద్దాపురంవరకు వచ్చిందని అటవీశాఖాధికారులు మంగళవారం రాత్రి వేలచింతలగూడెం నుంచి భీమోలు వైపుగా పులి కదలికలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో సమీప గ్రామాలకు చెందిన ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పరీక్షల్లో ఒత్తిడిని జయించడంపై కౌన్సెలర్లకు శిక్షణ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడిని జయించడం, ఆరోగ్యకరమైన జీవన నైపుణ్యాలను అలవర్చుకోవడం, సోషల్ మీడియా వాడకం తగ్గించుకోవడంపై కళాశాలల్లోని కౌన్సెలర్లకు శిక్షణ ఇచ్చామని ఇంటర్ విద్య ఆర్‌జేడీ ఐ.శారద తెలిపారు. రెండు కళాశాలల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మొత్తం 120 మందికి శిక్షణ ఇచ్చామని.. వారు అయా కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. కాగా ఆర్‌ఐవో ఎస్ఎస్‌వీఎల్ నరసింహం, డీఈసీ మెంబర్లు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

24గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటాం

• డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నల్లజర్ల, ఫిబ్రవరి 21 : పోతవరం పీహెచ్‌సీలో అందుబాటులో లేని వైద్యులు అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనంపై డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ కె.వెంకట్రావు స్పందించారు. హుటాహుటిన విచారించాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ సంధ్యకు ఆదేశాలు జారీ చేయడంతో బుధవారం పోతవరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి విచారించారు. విచారణ సమయంలో సర్పంచ్ లక్ష్మణరావు, ఎంపీటీసీ పాపా నాగు, జడ్పీటీసీ ముప్పిడి వెంకటరత్నం డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వోను కలిసి కేవలం ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకే ఆసుపత్రి ఉంటుందని, ఆదివారం తాళాలు వేసి ఉంటుందని చెప్పడంతో సిబ్బందితో మాట్లాడారు. మూడు షిఫ్టులు ఏర్పాటు చేసి 24గంటలు ఆసుపత్రి తెరిచి ఉండే విధంగా ఆదేశించారు. డాక్టర్లు ఇద్దరిలో ఒకరు ప్రతిరోజు ఓపీ చూసే విధంగా పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి నుంచి 24గంటలు ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకున్నామని, డాక్టర్ ప్రతిరోజు ప్రజలకు వైద్య సేవలు అందిస్తారన్నారు. అనంతపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే ఏర్పాట్లు పరిశీలించేందుకు డాక్టర్ రాజశేఖర్ వెళ్లారన్నారు. ఇక నుంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాలా ది రవికుమార్, ఎంపీటీసీ చిడిపి చింతయ్య పాల్గొన్నారు.


ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సంధ్య


గుంటూరులో పొగాకు బోర్డులో జరిగిన సమావేశానికి హాజరైన గోపాలపురం రైతులు

మార్చి 14న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

గోపాలపురం, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మార్కెట్‌కు అనుగుణంగా పొగాకు పంట పండించాలని పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ గుంటూరులో జరిగిన పొగాకుబోర్డు కార్యాలయంలో సూచించినట్లు రైతులు తెలిపారు. 3వ విడత మార్చి 14న గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం పొగాకుబోర్డులో పొగాకు కొనుగోళ్లు ప్రారంభించవచ్చని అనుమతి లభించిందన్నారు. మొదటి విడత ఫిబ్రవరి 29న, ఒంగోలు కొండేటి, రెండవ విడత మార్చి 6న కందుకూరు, 1, 2 వేలం కేంద్రాల్లో వెల్లపల్లిలో కొనుగోళ్ల ప్రారంభమవుతా యన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి రీజనల్ మేనేజర్ ఆది శేషయ్య, వేలం నిర్వహణాధికారి ఏడీ శ్యామ్, పొగాకుబోర్డు రైతు సంఘం నాయకులు పిన్నమనేని మధుమోహన్, పొగా కు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరిరావు, ఇల్లూరి రామ్‌తో పాటు 5 పొగాకు బోర్డు రైతులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నట్లు తెలిపారు.

దేవరపల్లి: దేవరపల్లి పొగా కుబోర్డు మార్చి 14న వేలం ప్రారంభించటం జరుగుతుందని దేవరపల్లి పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. రైతులు పొగాకులో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన పొగాకు ఉత్పత్తిచేసి సక్రమంగా పొగాకుబేళ్లు వేలంలో పెడితే గిట్టుబాటుధర వస్తుందన్నారు. రైతులు పొగాకు పంటలను 15రోజులకు ఒకసారి తిరగబెడుతూ ఉండాలని లేకపోతే తేమశాతం పెరిగే అవకాశం ఉందన్నారు. రైతులు మార్కెట్‌ను ఏ రకం అయితే డిమాండ్ ఉంటుందో ఆ పొగాకు బేళ్లను వేలంలో పెట్టుకోవాలని రైతులకు సూచించారు.


దేవరపల్లి వేలం నిర్వహణాధికారి జీఎల్‌కే ప్రసాద్

అంతరించుకుపోతున్న మొక్కల జాతులను రక్షించుకోవాలి

• ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త రవీంద్రకుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రకుమార్

కొవ్వూరు, ఫిబ్రవరి 21: అంతరించిపోతున్న మొక్కల జాతులను రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందని ఉద్యాన పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రకుమార్ అన్నారు. కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, పీజీ కళాశాలలో లైఫ్ సైన్సస్‌పై విద్యార్థులకు సెమినార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయన విద్యార్థులు తయారుచేసిన సైన్సు ప్రదర్శనలను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పరిశోధనలు చేయు దిశగా విద్యనభ్యసించి, శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ కె.రవీంద్రకుమార్ మాట్లాడుతూ మొక్కలలో కణజాల వర్ధనం, పోషకయానక తయారీని సూక్ష్మ జీవ రహితం చేయడంద్వారా మొక్కలను తక్కువ సమయంలో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలను పెంచవచ్చునన్నారు. అంతరించిపోతున్న మొక్కల కణజాలాన్ని ఉపయోగించి వైరస్ రహిత మొక్కలను తయారు చేయటం ద్వారా అధిక దిగుబడి, సేంద్రియ పద్ధతులను ఉపయోగించి మొక్కలలో వ్యాధినిరోధకతను పెంపొందించుకోవచ్చునన్నారు. అంత రించిపోతున్న మొక్కల జాతులను తిరిగి పొందడానికి ఈ కణజాల వర్ధనమ్ బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.రమేష్, డి.మాధురిదేవి, కె.సురేష్‌బాబు, టి.శవికళకుమారి, బి.రత్నదీపిక, పీజీ డైరెక్టర్ సీహెచ్ జలపతిరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.సూరిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

• జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి


సమావేశంలో మాట్లాడుతున్న అరిగెల అరుణకుమారి

కొవ్వూరు, ఫిబ్రవరి 21 : పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలారెడ్డి అధ్వర్యంలో చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలో నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అరుణకుమారి మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో కేంద్రం ఏపీకి ఇచ్చిన హామీలను జగన్మోహన్‌రెడ్డి తీసుకురావడంలో విఫలం చెందారన్నారు. వై.ఎస్. రాజశేఖరరెడ్డి వారసురాలిగా షర్మిలారెడ్డి పీసీసీ పగ్గాలు చేపట్టడంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఊపొచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డీఎస్సీ నిర్వహిస్తానని చెప్పిన జగన్మోహనరెడ్డి ఎన్నికల స్టంట్‌లో భాగంగానే నిర్వహిస్తున్నారన్నారు. యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో డీఎస్సీపై హోంమంత్రి తానేటి వనితకు వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమన్నారు. గురువారం చలో కలెక్టరేట్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగులు అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, యువతకు ఉద్యోగాలు రావాలన్నా, మహిళలు, దళితులు, మైనార్టీలు, బీసీలకు రక్షణ కలగాలన్నా కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం నియోజకవర్గంలోని మండల అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేశారు. కొవ్వూరు టౌన్ అధ్యక్షుడిగా గండం బాబ్జి, చాగల్లు మండల అధ్యక్షుడు బొనిగే రాంబాబు, తాళ్లపూడి మండల అధ్యక్షుడు సాయన సుబ్బారావు, కొవ్వూరు మండల అధ్యక్షుడు జొన్నకూటి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడిగా కొణిదెల శ్రీనివాసరావులకు నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గెద్దం సాయిబాబా, కొ య్య వెంకట్రావు, అండె నాగభూషణం, మీసాల సత్యనారాయణ, గుమ్మాపు జాన్, పాలకుర్తి ప్రభాకర్‌చౌదరి, మట్టా రవికుమార్, బండి విజయభాస్కరరావు, రామ్ కుమార్, చంద్రశేఖర్, మానవి, సుజాతసాలి ప్రసన్న, మురళీధర్ పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తలకు

రూ.1.20లక్షల చెక్కు అందజేత

ఉంగ్రాజవరం, జనవరి 21 : జనసేన కార్యకర్తలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని జనసేన నియోజకవర్గ ఇన్ ఛార్జి టీవీఎస్ఎన్ ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తాడిపర్రు గ్రామంలో ఇటీవల మరణించిన జనసైనికుడు తోట పండు కుటుంబానికి జనసేన పార్టీ తరపున రూ.1.20లక్షల చెక్కును ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జనసైనికులకు, వారి కుటుంబాలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉండి, వారి శ్రేయస్సుకోసం కృషి చేస్తుందని ప్రసాద్ పేర్కొన్నారు. జనసేన పార్టీ మండల అధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.


తోట పండు కుటుంబానికి చెక్కును అందిస్తున్న జనసేన పార్టీ ఇన్‌ఛార్జి ప్రసాద్, నాయకులు


పెరవలిలో సహస్ర పద్యగళార్చన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


తాళ్లపూడి: జల్లిపాడు పాఠశాలలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మాతృభాషలో మాట్లాడని వాడు తల్లిని ప్రేమించలేడు

• అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాళ్లపూడి, ఫిబ్రవరి 21: తెలుగే జీవనం, జీవితం అని మాతృభాషలో మాట్లాడని వాడు తల్లిని కూడా ప్రేమించలేడని ఏఎస్‌వో జోడాల అన్నారు. తాళ్లపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సీతారామరాజు, దీపక్, నరేష్, శ్రీలక్ష్మి, భాగ్యలక్ష్మి, నాగరాజు, నాగేంద్ర పాల్గొన్నారు.

• మండలంలోని బల్లిపాడు గ్రామంలోని జేబీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మాతృ భాషా ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు జీవీకే రాజు, ఉపాధ్యాయుల వరలక్ష్మి, రాజ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరవలి, ఫిబ్రవరి 21: మాతృభాషా పరిరక్షణ సేవా సమితి అధ్వర్యంలో సహస్ర పద్యగళార్చన, వేమన శతకం కార్యక్రమం నిర్వహించారు. కానూరులోని రమాగాయత్రి పాఠశాలలో 50 మంది చిన్నారులతో 50 పద్యాలు రాగయుక్తంగా ఆలపించారు. ఈ సందర్భంగా సంస్థ గౌరవ సలహాదారు సీహెచ్ వీఎస్ నాగ భూషణం మాట్లాడుతూ వెయ్యి పద్యాలను ఆలపించేలా ఈ కార్యక్రమం రూపొందించామని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అజ్జరంలో: మాతృభాషా దినోత్సవం సందర్భంగా అజ్జరం నెం.11 పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎం ఎంఆర్‌వీఎస్ఎన్ రెడ్డి మా ట్లాడుతూ ప్రతీసెలా ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మా తృభాషా దినోత్సవం నిర్వహిస్తున్నారని భాషా సంస్కృతి క వెద్యం కాపాడటంద్వారా జీవ వైవిధ్యం కాపాడవచ్చునని యునెస్కో పేర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దాసరి ప్రసాద్, కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

తాడిపర్రులో ఉపాధి పనులపై సమీక్ష

ఉంగ్రాజవరం, ఫిబ్రవరి 21 : మండలంలోని తాడిపర్రు గ్రామంలో బుధవారం ఉపాధిహామీ పథకం పనుల ఎంపికపై గ్రామసర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టే పనులపై సమీక్ష నిర్వహించారు. కొత్త పనులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు, డీఆర్పీ వి.అప్పలనాయుడు,ఫీల్డ్ అసిస్టెంట్ కత్తు ల రవిబాబు, రైతులు, ఉపాధికూలీలు పాల్గొన్నారు.

రైల్వే కరెంటు వైరు పట్టుకుని..

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): హైవోల్టేజీ కరెంటు వైరు పట్టుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని జీఆర్పీ సీఐ విజయ్ శంకర్ తెలిపారు. రాజ మండ్రి రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాంలో ఆగి ఉన్న గూడ్స్ రైలు ఎక్కి కరెంటు వైరు పట్టుకున్నాడని, దీంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడన్నారు. మృతుడు కుడి చేయిపై బిందు, అమ్మ, ఓం అని పచ్చబొట్లు ఉందని పేర్కొ న్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆ వ్యక్తి వివరాలు తెలిసిన వారు ఫోన్: 08832442821, 9491444022కి సమాచారం అందించాలని సీఐ కోరారు.

వైభవంగా నరసింహస్వామి అధ్యయనోత్సవాలు

కోరుకొండ, ఫిబ్రవరి21: కోరుకొండ తిరునాళ్ళ పేరుతో ప్రారంభమైన శ్రీ లక్ష్మి నరసింహస్వామి అధ్యయన మహోత్సవాలు 2వ రోజు బుధవారం స్వామి వారికి కొండపైన తీర్థ బిందె సేవ, తిరుప్పొల్లాడు, తొళక్కం నిర్వహించారు. అధ్యాపక స్వాములు ఇరగవరపు కృష్ణామాచార్యులు, చక్రవర్తి ఆచార్యులు, మార్గపురి నరసింహాచార్యులు, తదితరులు స్వామివారి అధ్యయనోత్సవాలు సందర్భంగా కొండపైన ఉదయం సాయంత్రం ప్రత్యేక సేవాకాలం నిర్వహించారు. అనంతరం రాత్రి శ్రీభూ సమేత అనంత పద్మనాభ స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈ గ్రామోత్సవంలో ఆలయ అనువంశికధర్మకర్తలు పరాసర లక్ష్మీనరసింహ భట్టర్, పరాసర రంగరాజ భట్టర్, అర్చక స్వాములు చంటిబాబు, నాగు, గిరిధరాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ ప్రభుత్వంతో ప్రజాస్వామ్యం ఖూనీ


సమావేశంలో మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రూ అనిల్

దేవరపల్లి, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలపై దాడులు జరగటంతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని మండల టీడీపీ అధ్యక్షుడు అంద్రూ అనిల్ అన్నారు. దేవరపల్లిలో టీడీపీ పార్టీ కార్యాలయంవద్ద బుధవారం విలేఖర్ల సమావేశంలో అయన మాట్లాడారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వారిని ప్రభుత్వం వెంటనే అరెస్టు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే హైకోర్టు సుమోటో కేసు కింద బాధ్యులపై కేసులు నమోదు చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో పాత్రికేయులకు రక్షణ లేకుండాపోయిందన్నారు. ఈ దాడులపై హోంశాఖమంత్రి తానేటి వనిత స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, కొఠారు ధ్రువకాంత్, నడింపల్లి విజయ్‌కుమారరాజు, అక్కిరాజు, పిన్నమని నవీన్, రాజేశ్వరి, ఒరుగంటి జగదీశ్వరరావు, శ్రీనాథ్ నగేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడు మృతిపై సంతాపం

కొవ్వూరు, ఫిబ్రవరి 21 : మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు జాలడుగుల వాసుబాబు అకాల మృతికి ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు సంతాపం తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద వాసుబాబు మృతదేహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ పరిమి హరిచరణ్, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, జేఏసీ నాయకులు రాజాన అప్పారావు, అసోసియేషన్ నాయకులు భూపతి రవీంద్ర, పూజారి వాసు, మీసాల కిషోర్, వద్దాది శ్యాం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.